


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 358, పేజీలు - 08

గురువారం, జూన్ 18, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## ట్రంప్ సర్కార్ షాకింగ్ డెసిషన్

- ఇండో-పసిఫిక్ కమాండ్ పేరు మార్పు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అమెరికా రక్షణ విభాగం తీసుకున్న కొన్ని తాజా వ్యూహాత్మక నిర్ణయాలు అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో, ముఖ్యంగా భారత రక్షణ, విదేశాంగ శాఖల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. తమ అత్యంత ప్రతిష్టాత్మకమైన సైనిక విభాగం యూఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్ పేరు నుండి ఇండో పదాన్ని తొలగిస్తూ, దానిని తిరిగి పాత పేరు అయిన యూఎస్ పసిఫిక్ కమాం గా మారుస్తూ అమెరికా రక్షణ శాఖ నిర్ణయం తీసుకుంది. దీనికి తోడు, అమెరికా అధికారికంగా విడుదల చేసిన ఒక అంతర్గత మ్యాప్‌లో పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రాంతాన్ని పాకిస్థాన్ భూభాగంగా చూపించడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ల మధ్య జరగబోయే కీలక ద్వైపాక్షిక భేటీకి ముందే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతృప్తి చేసుకుంది.

2లో..

# విద్యతోనే జీవితాల్లో మార్పు

- ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటే చిన్నతనం కాదు

- ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన సీఎం
- విద్యారంగానికి రూ.27 వేల కోట్ల వ్యయం చేస్తున్నట్లు వెల్లడి
- త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ
- కులవివక్ష నిర్మూలన లక్ష్యంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్
- ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామన్న సీఎం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ పాఠశాలలంటే అనాథలు, ఆర్థికంగా చితికిపోయిన వారు చదువుకుంటారన్న అభిప్రాయాన్ని సంపూర్ణంగా మార్చివేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలన్న సంకల్పంతో ఆరుట్ల గ్రామంలో ప్రారంభించిన తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి లోకానికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, అత్యాధునిక వసతులతో రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం రేవంత్ రెడ్డి బుధవారం (జూన్ 17) రోజున ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం అందించే బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులకు ఆరుట్ల పబ్లిక్ స్కూల్ స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేనేజ్‌మెంట్ కమిటీకి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల అనగానే తక్కువగా భావించే విధంగా అందరి మదిలో నెలకొన్న అనుమానం, అపనమ్మకాలను పోగొట్టాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విధంగా కుటుంబాల్లో ఆత్మవిశ్వాసం పెంచాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో చదువుకుంటే



దాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ లుగా రాణించగలరన్న ఒక బృహత్తర సంకల్పంతో ఈ పాఠశాలను

2లో..

## గుడిసెలు లేని తెలంగాణ మా లక్ష్యం

- రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు

- రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి ప్రత్యేక ప్రాధాన్యత
- అసంపూర్తి ఇళ్లకు కూడా అవకాశమన్న పొంగులేటి
- లబ్ధిదారుడే ఇంటి నిర్మాణదారు అన్న మంత్రి




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదు అనే లక్ష్యంతో పనిచేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు తీవ్ర కసరత్తులు చేస్తోంది. ఇప్పటికే తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా చాలా ఇళ్లు పూర్తిగా నిర్మాణం కాగా మరికొన్ని చివరి దశలో ఉన్నాయి. ఈ క్రమంలోనే రెండో దశ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే గుడిసెల్లో ఉండే వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. అదే సమయంలో పైకప్పులు బలంగా లేని ఇళ్లకు రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందించనున్నారు.

ఇందులో భాగంగానే రాష్ట్రంలో ఉన్న గుడిసెలను గుర్తించేందుకు సమగ్ర సర్వే చేయాలని సంబంధిత అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే తాజాగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించి అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ చేపట్టారు. కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో సుమారు 75 వేల మంది గుడిసెల్లో ఉంటున్నట్లు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్న మంత్రి పొంగులేటి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అర్హులను గుర్తించాలని తెలిపారు. ఇక గతంలో దరఖాస్తు చేసుకోని వారు కూడా ఎంపీడీవో ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకోవచ్చని

2లో..

## ఎల్‌నినో ఎఫెక్ట్..
## పంటల మార్పిడిపై సీఎం దృష్టి

- పంటల మార్పిడి అవకాశాలను పరిశీలించాలని సూచన
- ప్రకృతి సేద్యం వైపు రైతులను ప్రోత్సహించాలని ఆదేశం
- పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై సమావేశాలకు నిర్దేశం
- కష్టకాలంలో రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టీకరణ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో వ్యవసాయ, ఉద్యానవనం, ఆక్వా రంగాలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, పంట మార్పిడి దిశగా రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ,

2లో..

## అప్రమత్తం కాకుంటే నష్టపోతాం


- పార్టీ కేడర్ కు కేటీఆర్ హెచ్చరిక

2లో..



## అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే

- ఉద్యోగుల పనితీరుపై 360 డిగ్రీల్లో విశ్లేషిస్తానన్న సీఎం






**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రతి ఒక్క అధికారి క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జూన్ నెల నుంచి అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పాలనా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు దాటింది. తప్పులు జరగకుండా యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలి. లోపాలు ఏమైనా ఉంటే వాటిని ఏ విధంగా సరి చేయాలనే అంశం మీద ఫోకస్ పెట్టాను. అధికారులు, ఉద్యోగులు కూడా ఆ దిశగా ఆలోచన చేయాలి. ప్రజలకు సేవలు అందించే విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం

2లో..



## కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీతో రాజీపడే ప్రసక్తే లేదు

- బీఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని వ్యాఖ్య
- బీఆర్ఎస్ పుస్తకాన్ని తాను మూసేశానని స్పష్టం
- 'తెలంగాణ రక్షణ సేన'తోనే రాజకీయ ప్రయాణమన్న కవిత

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కే. చంద్రశేఖర్ రావుతో గానీ, ఆ పార్టీతో గానీ తిరిగి కలిసే ప్రసక్తే లేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని, ఆ పుస్తకాన్ని తాను ఇప్పటికే పూర్తిగా మూసేశానని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. తన నూతన పార్టీ తెలంగాణ రక్షణ సేన

2లో..

## హనుమకొండలో పవన్ కల్యాణ్

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన పవన్
- తెలంగాణ ప్రజలు చూపిస్తున్న ప్రేమను జీవితాంతం గుర్తుంచుకుంటానని ట్వీట్
- నిరంజన్ ధైర్యం, ఆత్మవిశ్వాసం స్ఫూర్తిదాయకమని ప్రశంసలు



**హన్మకొండ (ప్రశ్న న్యూస్)** ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. తెలంగాణలోని హన్మకొండకు పట్టణానికి చెందిన తన వీరాభిమాని పొనుగోటి నిరంజన్ ను పరామర్శించారు. ఆప్యాయంగా హృదయానికి హత్తుకున్నారు. ఆ చిన్నారి కోరికను నెరవేర్చారు. ఈ ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఆయన కొద్దిసేపటి కిందటే హన్మకొండకు చేరుకున్నారు. నేరుగా హనుమాన్ నగర్‌లో ఉన్న నిరంజన్ నివాసానికి వెళ్లారు. అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్నాడు నిరంజన్. డీఎండీ అనే అరుదైన కండరాల క్షీణత వ్యాధితో మంచానికే పరిమితం అయ్యాడు. పవన్ కల్యాణ్ కు వీరాభిమాని. తనను కలవాలని ఆశపడుతున్న విషయం జనసేన తెలంగాణ ప్రతినిధుల ద్వారా పవన్ కల్యాణ్ తెలుసుకున్నారు. డిప్యూటీ సీఎం హోదాలో బీజీగా ఉన్నప్పటికీ.. తన అభిమాని కోసం స్వయంగా అతని ఇంటికి వచ్చారు. లేవలేని స్థితిలో ఉన్న ఆ చిన్నారిని చూసి పవన్ చలించిపోయారు. మంచంపై నిరంజన్ పక్కనే కూర్చొని ఆత్మీయంగా హత్తుకున్నారు. ఆప్యాయంగా నుదుటిపై ముద్దుపెట్టారు. ధైర్యం చెప్పారు. నిరంజన్ గతంలో ఆరోగ్యంగా ఉన్న సమయంలో సినిమాల్లోని డాన్స్ స్టెప్స్‌ను అనుకరిస్తూ చేసిన స్టెప్పులు, ఫొటోలను పవన్ ఆసక్తిగా తిలకించారు.

2లో..

## సైబర్ నేరగాళ్లు సమాజానికి పరాన్నజీవులు

- సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల సంపదను దోచుకునే 'పరాన్నజీవులు' అని, వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉందని సుప్రీంకోర్టు బుధవారం ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఒక సైబర్ మోసం కేసులో నిందితుడికి బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. తనపై వివిధ రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కలిపి విచారించాలని కోరుతూ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఈ అంశంపై సంబంధిత హైకోర్టులను ఆశ్రయించాలని ధర్మాసనం సూచించింది.


"మీలాంటి వారు పరాన్నజీవులు. అమాయక మదుపరుల నుంచి సొమ్ము వసూలు చేసి వారిని వంచిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల విషయంలో మేము అత్యంత కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుంది" అని విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఈ తరహా నేరగాళ్లు తమిళనాడు నుంచి జమ్మూకశ్మీర్ వరకు దేశవ్యాప్తంగా అమాయకులను లక్ష్యంగా

2లో..

## ఫీజుల బాటలో ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్


- మెటా కీలక నిర్ణయం

2లో..




## మొహం చాటేస్తున్న రుతుపవనాలు!

- 40శాతం తగ్గిన వర్షాలు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దేశంలో నైరుతి రుతుపవనాల పురోగతి మందగించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం,

2లో..

# ట్రంప్ సర్కార్ షాకింగ్ డెసిషన్

### పేరు మార్పు వెనుక ట్రంప్ వ్యూహం ఏంటి?

గతంలో డోనాల్డ్ ట్రంప్ తన మొదటి విడత పదవీ కాలంలో చైనాను కట్టడి చేయడంలో భారత్ ప్రాధాన్యతను గుర్తిస్తూ, అప్పటివరకు ఉన్న 'పసిఫిక్ కమాండ్' పేరును 'ఇండో-పసిఫిక్ కమాండ్'గా మార్చారు. అయితే, ఇప్పుడు మళ్లీ ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఈ పేరును మార్చడం వెనుక భిన్నమైన వ్యూహాలు ఉన్నట్లు జాతీయ మీడియా విశ్లేషిస్తోంది. అమెరికా తన సైనిక ప్రాధాన్యతలను కేవలం పసిఫిక్ మహాసముద్రం, దక్షిణ చైనా సముద్రం వంటి తూర్పు ఆసియా ప్రాంతాలకే పరిమితం చేయాలని చూస్తోందా? లేదా హిందూ మహాసముద్రం బాధ్యతలను పూర్తిగా భారత్‌కే వదిలేయాలని భావిస్తోందా? అనే కోణంలో చర్చ నడుస్తోంది. ఏదేమైనా, పేరులోంచి ఇండో అనే పదాన్ని తొలగించడం దౌత్యపరంగా భారత్‌కు ఒక గట్టి సంకేతమేనని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### మ్యాప్ వివాదం

పేరు మార్పు వివాదం నడుస్తుండగానే, అమెరికా రక్షణ వర్గాలు వాడిన ఒక మ్యాప్ భారత రక్షణ వర్గాలను తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. జమ్మూ కశ్మీర్‌లోని అంతర్భాగమైన, ప్రస్తుతం పాక్ అక్రమ ఆధీనంలో ఉన్న పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రాంతాన్ని అమెరికా తన మ్యాప్‌లో అధికారికంగా పాకిస్థాన్ సరిహద్దుల్లో చూపించింది. భారతదేశ సార్వభౌమత్వాన్ని, భౌగోళిక సమగ్రతను దెబ్బతీసే విధంగా సూపర్ పవర్ అమెరికా ఇలాంటి తప్పు చేయడం ప్రమాదకరమైన పరిణామమని, ఇది దశాబ్దాలుగా కశ్మీర్ విషయంలో అమెరికా పాటిస్తున్న తటస్థ విదేశాంగ విధానానికి పూర్తి విరుద్ధమని భారత్ భావిస్తోంది.

### భారత్ తీవ్ర స్పందన

ఈ రెండు పరిణామాలపై భారత విదేశాంగ శాఖ అత్యంత ఘాటుగా స్పందించింది. న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయ అధికారులను పిలిపించి భారత్ తన తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తూ అధికారిక అభ్యంతర పత్రం జారీ చేసింది. కశ్మీర్ భౌగోళిక సరిహద్దుల విషయంలో ఎలాంటి తప్పుడు మ్యాప్‌లను ఆమోదించే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. భౌగోళికంగా, చట్టబద్ధంగా పీఓకే భారతదేశంలో అంతర్భాగమని పునరుద్ఘాటించింది. అలాగే, కమాండ్ పేరు మార్పుపై వాషింగ్టన్‌లోని పెంటగాన్ ఉన్నతాధికారులతో భారత రక్షణ శాఖ సంప్రదింపులు జరుపుతోందని, దీనిపై అమెరికా నుంచి స్పష్టమైన వివరణ కోరినట్లు విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి.

### మోదీ-ట్రంప్ భేటీకి ముందే ఎందుకు?

ప్రధాని నరేంద్ర మోదీ, ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ల మధ్య త్వరలోనే కీలక భేటీ జరగాల్సి ఉంది. వాణిజ్యం, హెచ్-1బీ వీసాలు, రక్షణ ఒప్పందాలపై చర్చించాల్సిన ఈ తరుణంలోనే ఈ వివాదాలు తెరపైకి రావడం దౌత్యపరమైన ఒత్తిడి పెంచే వ్యూహమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రక్షణ రంగంలో భారత్, రష్యాల మధ్య ఉన్న మైత్రిని లేదా చైనా విషయంలో భారత్ పాటిస్తున్న స్వతంత్ర విధానాన్ని తప్పుబడుతూ అమెరికా ఈ విధమైన సైలెంట్ వార్నింగ్ ఇస్తోందా అనే విశ్లేషణలు కూడా సాగుతున్నాయి. ఈ వివాదాలు రాబోయే ద్వైపాక్షిక చర్చలపై ఖచ్చితంగా ప్రభావం చూపే అవకాశం ఉంది.

# విద్యతోనే జీవితాల్లో మార్పు

తీర్చిదిద్దామని తెలిపారు. ఆరుట్ల పాఠశాల తెలంగాణకు ఒక రోల్ మోడల్ గా, స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు.తెలంగాణలో విద్యా విధానం ధ్వంసమైందని ఇప్పుడు దానిని వికాసం వైపు నడిపించే విధంగా ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఆదర్శంగా నిలుస్తుందని తాను నమ్ముతున్నానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ స్కూల్ రోల్ మోడల్‌గా ఎలా నిలుస్తుందో ఎవరొచ్చినా చూపించాలని చెప్పారు. ఈ అద్భుతమైన కార్యానికి ప్రజలు సంపూర్ణంగా అండదండలు అందించాలని కోరారు. అభివృద్ధి అంటే అద్దాల మేడల్లో, రంగుల గోడల్లో కాదని తెలంగాణ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉందని అన్నారు. విద్యపై పెట్టే ఖర్చు భవిష్యత్తు పెట్టుబడి అని సంపూర్ణంగా విశ్వసిస్తానని చెప్పారు. విద్యతోనే సమాజంలో మార్పు తీసుకురావాలి, అంటరానితనాన్ని, అసమానతలను నిర్మూలించాలని పేర్కొన్నారు. మూడు లక్షల కోట్లపైన ఉన్న రాష్ట్ర బడ్జెట్ లో 8 శాతానికి పైగా దాదాపు 26 వేల కోట్ల రూపాయలు విద్యా శాఖపైన, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఖర్చు చేస్తున్నామని చెప్పారు. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు పాఠశాలలో 1,814 మంది పిల్లలు పాఠశాలలో చేరగా సీట్లు ఖాళీ లేవని, అడ్మిషన్లు పూర్తయ్యాయని ప్రభుత్వ పాఠశాల బయట బోర్డు పెట్టే పరిస్థితికి రావడం పట్ల కమిటీని అభినందిస్తున్నానని తెలిపారు. ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో వచ్చిన అనుభవాలను పాఠాలుగా పరిగణలోకి తీసుకుని భవిష్యత్తులో ఇతర స్కూళ్లను మరింత మెరుగ్గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ స్కూళ్లలో చదివి రేపటి భవిష్యత్తు నాయకులుగా తయారవుతారని సంపూర్ణంగా నమ్ముతున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి పాత్ర మరువలేనిదని అందుకే ఇక్కడ పాఠశాలను తీర్చిదిద్దామని తెలిపారు. ఆరుట్ల గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలో తీసుకుని ప్రతి పేదవారికి విద్యను అందించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటే చిన్నతనం కాదని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని తెలిపారు. దేశంలో గొప్ప గొప్ప వాళ్లంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారేనని తెలిపారు. కేవలం సంక్షేమ పథకాలు భవిష్యత్తును మార్చలేవని మన భవిష్యత్తు మారాలన్నా, తల్లిదండ్రులు ఆత్మగౌరవంతో బతకాలన్న చదువుకోవాలని చదువుకున్నప్పుడే మన ఊరికి, మన రాష్ట్రానికి, దేశానికి పేరొస్తుందని పేర్కొన్నారు.ఎవరెన్ని విమర్శలు చేసినా విద్యా రంగంలో సంస్కరణలతో ముందుకు వెళుతూ కేజీ నుంచి పీజీ వరకు అత్యుత్తమ విద్యను అందించాలన్నదే తమ సంకల్పం అని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తున్నాం. వివిధ కులాల వారిగా వేర్వేరుగా పాఠశాలలు ప్రారంభించి కులాలు, వర్గాల అడ్డుగోడలు నిర్మించి విభజన చేస్తున్న విధానికి స్వస్తి పలకాలన్న లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ డ్రెస్సులు, షూలు, సాక్సులు, దుప్పట్లు, స్కూల్ బ్యాగులతో కూడిన కిట్స్ అందజేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వీటిని అంతర్జాతీయ ప్రమాణాలతో, అంతర్జాతీయ సంస్థలతో తయారు చేయిస్తున్నామని తెలిపారు. రూ. 688 కోట్లతో టెండర్లు పిలిచాం. పనులు జరుగుతున్నాయని జూలై ఆఖరు నుంచి వాటిని పంపిణీ చేస్తామని చెప్పారు.మాదక ద్రవ్యాల వాడకం ఒక మహమ్మారిగా మారిందని ఈ దురలవాట్లను నియంత్రించాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీన ఎల్బీ స్టేడియం వేదికగా రాష్ట్ర గవర్నర్ గారి సమక్షంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా వేలాది మంది విద్యార్థినీ విద్యార్థులతో ప్రమాణం చేయించే కార్యక్రమం ద్వారా మాదక ద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులను చైతన్యం చేసే కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఏఐతో ప్రపంచ వ్యాప్తంగా వైట్ కాలర్ ఉద్యోగాలు ప్రమాదంలో పడుతున్న నేపథ్యంలో నైపుణ్యాలను నేర్పించి బ్లూ కాలర్ ఉద్యోగాలు కల్పించాలన్న ఉద్దేశంతో స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మొదటి ఏడాదిలోనే అందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కి మంచి అవకాశాలు పొందడం సంతోషించదగిన విషయమని అన్నారు. 140 కోట్ల జనాభా కలిగిన దేశం నుంచి ఒలింపిక్స్ క్రీడల్లో రాణించలేకపోతున్నామని అన్నారు. ఒక్క స్వర్ణ పతకాన్ని కూడా సాధించలేకపోతున్నామంటే తలదించుకోవలసిన పరిస్థితి అని పేర్కొన్నారు. అందుకే పబ్లిక్ - ప్రైవేట్ మోడల్ లో స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించుకున్నామని విద్యార్థులు, క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపడానికే ఫుట్‌బాల్ ప్రపంచ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ రప్పించామని తెలిపారు.

# గుడిసెలు లేని తెలంగాణ మా లక్ష్యం

పేర్కొన్నారు.మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు, ఎంపికలో కులం, మతం, పార్టీ అనే తేడాలు లేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. నియోజకవర్గానికి 2 వేల ఇళ్ల చొప్పున రాష్ట్రంలో మొత్తం 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేశామని తెలిపిన పొంగులేటి లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

ఈ క్రమంలోనే పేద ప్రజల నివాస భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకాన్ని కూడా అమలు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. రాష్ట్రంలోని ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 500 చొప్పున.. మొత్తంగా 50 వేల ఇళ్లను ఈ రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం కింద ఎంపిక చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

ఇళ్లకు పునాదులు, గోడలు బలంగా ఉన్నప్పటికీ పైకప్పులపై టార్పాలిన్ షీట్లు, రేకులు ఏర్పాటు చేసి ప్రమాదకరంగా ఉన్న ఇళ్లను గుర్తించాలని ఆ ఇళ్లకు స్లాబ్ నిర్మించేందుకు వారికి రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. దీంతో పైకప్పు లేని వారు ఇందిరమ్మ ఇళ్లు రాకున్నా స్లాబ్ వేసుకునేందుకు ముందుకు వస్తున్నారు.

# సైబర్ నేరగాళ్లు సమాజానికి పరాన్నజీవులు

చేసుకుంటున్నారని ధర్మాసనం ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి నేరస్థులను జైల్లోనే ఉంచడం సామాజిక ప్రయోజనాలకు శ్రేయస్కరమని ధర్మాసనం పేర్కొంది. దేశంలో "డిజిటల్ అరెస్ట్" వంటి స్కామ్‌లతో సహా ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ మోసాల ధాటికి వృద్ధులు, సామాన్యులు కోట్ల రూపాయలు మేర నష్టపోతున్నారని, అటువంటి వారిని కట్టడి చేసేందుకు కఠినమైన న్యాయపరమైన వైఖరి అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

# ఎల్‌నినో ఎఫెక్ట్.. పంటల మార్పిడిపై సీఎం దృష్టి

రైతులను పెద్ద ఎత్తున ప్రకృతి సేద్యం వైపు మళ్లించేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల సర్టిఫికేషన్‌కు ప్రాధాన్యత పెరుగుతున్న దృష్ట్యా, ఈ అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి చైతన్య కార్యక్రమాల్లో తాను కూడా స్వయంగా పాల్గొంటానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతులు శాస్త్రీయ విధానాల్లో సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మిర్చి, పొగాకు, తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పొగాకు కొనుగోలుదారులతో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించే వరకు పంటను నిల్వ చేసుకునేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. అధిక డిమాండ్ ఉన్న పప్పు దినుసుల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా చూడాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు విలువ జోడింపు అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఆక్వా రైతులు, ఫీడ్ తయారీదారుల సమస్యల పరిష్కారానికి వారితోనూ సమావేశం కావాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మొహం చాటేస్తున్న రుతుపవనాలు!

వర్షపాతంలో ఏకంగా 40 శాతం లోటు నమోదైంది. జూన్ 4 నుండి జూన్ 17 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా సాధారణంగా 65.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 39.7 మిమీ వర్షం మాత్రమే పడింది. ఇది దేశీయ రైతాంగానికి, ఖరీఫ్ సాగు పనులకు పెద్ద సవాలుగా మారింది. ఇన్శాట్-3డీఎస్ ఉపగ్రహం అందించిన తాజా చిత్రాలు మరింత కలవరపెడుతున్నాయి. దేశంలోని మధ్య, పశ్చిమ ప్రాంతాల పైన ఆకాశంలో మేఘాల ప్రభావం అసలు లేకపోవడం గమనార్హం. ముఖ్యంగా మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక అంతర్గత ప్రాంతాలు పొడి వాతావరణంతో కనిపిస్తున్నాయి. సాధారణంగా ఈ సమయానికి దట్టంగా కమ్ముకోవాల్సిన మబ్బులు లేకపోవడంతో రుతుపవన శ్రేణి బలహీనపడినట్లు స్పష్టమవుతోంది. అధిక శాతం మేఘాలన్నీ కేవలం బంగాళాఖాతం, ఈశాన్య రాష్ట్రాలకే పరిమితమయ్యాయి.ఈ వర్షపాత లోటు పలు వ్యవసాయ ఆధారిత రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గుజరాత్‌లో అత్యధికంగా 98 శాతం వర్షపాత లోటు నమోదు కాగా, మహారాష్ట్రలో 79 శాతం ప్రతికూలత నమోదైంది. అలాగే జార్ఖండ్‌లో 66 శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 65 శాతం, మేఘాలయలో 85 శాతం మేర వర్షాలు కురవలేదు. ఈ కేటగిరీలోనే తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, బీహార్, అస్సాం రాష్ట్రాలలో కూడా వానల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. జూన్ నెల వ్యవసాయ రంగానికి అత్యంత కీలకమైన సమయం. వరి, పత్తి, సోయాబీన్, పప్పుధాన్యాల సాగు ఈ సమయంలోనే ఊపందుకుంటుంది. అయితే వర్షాలు ముఖం చాటేయడంతో భూమిలో తేమ శాతాన్ని ఈ పొడి వాతావరణం దెబ్బతీస్తోంది. విత్తనాలు వేసే ప్రక్రియ నెమ్మదించింది. అరేబియా సముద్రం నుండి వీచే మారుతాలు బలహీనపడటం, వాతావరణ ఎగువ పొరల్లో గాలుల తీవ్రత కారణంగానే వర్షాలు కురవడం లేదని వాతావరణ శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. రుతుపవనాల పురోగతి దాదాపు ఒక వారంగా స్తంభించిపోవడానికి ఇదే ప్రధాన కారణం.అయితే, జూన్ 21 తర్వాత రుతుపవనాలలో కొంత చలనం వచ్చే అవకాశం ఉందని వాతావరణ అంచనా నమూనాలు సూచిస్తున్నాయి. అరేబియా సముద్రం నుండి తేమతో కూడిన గాలులు మళ్లీ పుంజుకుని, దేశవ్యాప్తంగా వర్షాలు కురిసేందుకు పరిస్థితులు అనుకూలించవచ్చు. ఒకవేళ జూన్ చివరి నాటికి కూడా ఈ లోటు భర్తీ కాకపోతే, దేశీయ వ్యవసాయ రంగానికి గట్టి ఎదురుదెబ్బ తగలడంతో పాటు ఆహార భద్రత, ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం పడే ప్రమాదం ఉంది.

# హనుమకొండలో పవన్ కల్యాణ్

ఇంట్లో వాళ్లు, స్నేహితులు అంతా ఛోటా గబ్బర్ సింగ్ అని పిలుస్తారని ఆ బాలుడు ఆనందంతో చెప్పగా ఎంతో సంతోషించారు. నిరంజన్ పడుతున్న బాధను చూసి కదిలిపోయిన పవన్, ఆ బాలుడి తండ్రి రాంగోపాల్, తల్లి మానసతో మాట్లాడారు. చికిత్స గురించి ఆరా తీశారు. భగవంతుని ఆశీస్సులు ఉంటాయంటూ తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి శేషవస్త్రాన్ని ఆ బాలుడికి కప్పి, తీర్థప్రసాదాలను అందించారు. వైద్య ఖర్చుల నిమిత్తం పవన్ కల్యాణ్ తక్షణ సాయంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. వైద్య సాయంతోనే సరిపెట్టకుండా ఆ కుటుంబ శాశ్వత జీవనోపాధి కోసం ఒక దీర్ఘకాలిక భరోసాను కల్పించారు.నిరంజన్ తల్లిదండ్రులు గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటీన్‌లో పనిచేసిన అనుభవం ఉండటంతో వారికి ఓ క్యాంటీన్ ఏర్పాటు చేయించి జీవితంలో స్థిరపడేలా చూడాలని జనసేన పార్టీ తెలంగాణ నాయకులను సూచించారాయన. తనకు ఒక కుక్కపిల్ల కావాలని నిరంజన్ కోరగా, తప్పకుండా పంపిస్తానని పవన్ హామీ ఇచ్చారు. అద్దె ఇంట్లో ఉండడం వల్ల యజమానులు కుక్కను పెంచడానికి అంగీకరించట్లేదని నిరంజన్ తండ్రి చెప్పడంతో, పవన్ చొరవ తీసుకుని ఆ ఇంటి యజమానిని పిలిపించి మాట్లాడి ఒప్పించారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. నిరంజన్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి వెండి ప్రతిమను పూజించి ఆ కుటుంబానికి అందజేస్తానని చెప్పారు. అధికారిక హోదాలో ఉంటూనే ఒక సామాన్య అభిమాని కోరిక కోసం స్వయంగా తెలంగాణకు వచ్చి పవన్ చూపిన ఈ గొప్ప మనసు ఇరు రాష్ట్రాల ప్రజలలో ఆదరణ పొందుతోంది.

## ఎంపీలకు రూ.50 కోట్ల ఎంఎస్‌పీ..

# సంజయ్ రౌత్ ఆరోపణ

**ముంబై:** శివసేన (యూబీటీ)లో చీలిక ఏర్పడనుందని, ఏడుగురు ఎంపీలు పార్టీ ఫిరాయించనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో ఆ పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ ఎంపీలను పార్టీ మారేందుకు ఒక్కొక్కరికి రూ.50 కోట్ల కనీస మద్దతు ధర నిర్ణయించారని, అందులో రూ.15 కోట్లు అడ్వాన్స్ ఇస్తున్నారని రౌత్ ఆరోపించారు. దీనికిముందు, పార్టీ మారేందుకు ఒక్కొక్కరికి రూ.15 కోట్లు ఆఫర్ చేస్తున్నారనంటూ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రా వెంటనే స్పందించారు. 'కేవలం 15 కోట్లేనా? మా ఎంపీలకు రూ.4 కోట్లు అడ్వాన్, తర్వాత 36 నెలల వరకూ నెలకూ రూ.కోటి ఆఫర్ ఇచ్చారు. హనీ ప్లస్ మనీ' అని పోస్టు చేశారు.దీనికి వెంటనే సంజయ్ రౌత్ కౌంటర్ ఇచ్చారు. 'మహువా జీ.. ఒక్కో ఎంపీకి కనీస మద్దతు ధర రూ.50 కోట్లు ఫిక్స్ చేశారు. రూ.15 కోట్లు అడ్వాన్స్ మాత్రమే. నిజానికి వీళ్లు (ఎంపీలు) రూ.50,000 కూడా విలువచేయరు. శివసేన, టీఎంసీ బ్రాండ్ లేబుల్ కారణంగానే వాళ్ల ధర పెరిగింది' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వ్యంగ్యంగా పోస్ట్ పెట్టారు.

## జర్నలిస్టుల పిల్లలకు విద్యా ఫీజులో

# 50% రాయితీ అమలు చేయాలి

**- డిఆర్ఓ కి ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్టుల వినతి**



**నరసరావుపేట** పల్నాడు జిల్లాలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు సమాజానికి, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి - నిస్వార్థంగా ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టుస్ (ఏపీయూడబ్ల్యూజే) పేర్కొన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో 50%ఫీజు రాయితీ విద్యను కల్పించే అంశంపై పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కృతిక శుక్లా కి తెలియచేయగా వెంటనే సానుకూలంగా స్పందించి డిఆర్ఓ కు తగు చర్యలు తీసుకోమని ఆదేశించారు. ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిఆర్ఓ ని కలసి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ఏపీయూడబ్ల్యూజే నాయకులు హర్షం వ్యక్తం చేసి జర్నలిస్ట్ లు, ఏపీయూడబ్ల్యూజే తరుపున కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పల్నాడు జిల్లా సెక్రటరీ నాగరాజు, గౌరవాధ్యక్షులు జగన్, పల్నాడు జిల్లా కమిటీ మెంబర్ కోటేశ్వరాచారి, సాజిద్, నాయీమ్, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే

వహించవద్దు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేయాలి. ఫీల్డులోని సమస్యలను స్వయంగా పరిశీలిస్తే అధికార యంత్రాంగం మీద ప్రజల్లో మరింత నమ్మకాన్ని పొందగలం. తనిఖీలు చేస్తున్నారనే భావన ప్రజల్లో కలుగుతుంది. ఆ దిశగా ఉన్నతాధికారులు మొదలకుని క్షేత్రస్థాయి అధికారి వరకు అందరూ పని చేయాలి. జూలై నెల నుంచి ప్రతి అధికారి ఫీల్డుకు వెళ్లాల్సిందే. వారంలో మూడు రోజుల పాటు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని గతంలోనే చెప్పాం. దాన్ని తూచా తప్పకుండా అమలు చేయాలి. జిల్లా కలెక్టర్లు ప్రతి నియోజకవర్గాన్ని నాలుగు సార్లు సందర్శించాలని సూచించాం. దాన్ని పక్కాగా అమలు చేయాలి. అలాగే నియోజకవర్గాల నోడల్ అధికారులు నెలలో ఒకే మండలాన్ని నాలుగు సార్లు సందర్శించాలి. అధికారులు, ఉద్యోగుల పనితీరు మీద 360 డిగ్రీల్లో విశ్లేషిస్తాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

### దేవాదాయ శాఖ పనితీరు మరింత మెరుగవ్వాలి

"దేవాలయాల్లో భక్తులకు మరింత సేవలు అందించేలా దేవదాయ శాఖ మరింత ఫోకస్ పెట్టాల్సిన అవసరం కన్పిస్తోంది. దేవదాయ శాఖ ఉద్యోగుల పనితీరు మరింత మెరుగుపడాలి. అన్ని శాఖల్లోని ఉద్యోగుల పనితీరు ఎప్పటికప్పుడు మెరుగుపడాలి. ఈ మేరకు ఉద్యోగులకు అవసరమైన శిక్షణ ఇప్పించాలి. పరిపాలనలో సింగపూర్ దేశం వినూత్న విధానాలను అవలంభిస్తోంది. పరిపాలన విషయంలో ఆ దేశ విధానాలను పరిశీలించాలి. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో మొత్తంగా 11,600 గుంతలు ఉన్నట్టు గుర్తించాం. వీటిల్లో 79 శాతం గుంతలను పూడ్చాం. మిగిలిన రోడ్లను కూడా త్వరితగతిన మరమ్మత్తులు చేపట్టాలి. ముఖ్యంగా అర్బన్-రూరల్ కనెక్టివిటీ రోడ్లల్లో మరమ్మత్తులు త్వరగా చేపట్టాలి. అలాగే రోడ్ల నిర్మాణం, మరమ్మత్తులకు సంబంధించి ఆర్ అండ్ బి మున్సిపల్ శాఖలు సమన్వయంతో పని చేయాలి."అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

### గవర్నెన్సుకు టెక్నాలజీ అనుసంధానం

"డేటా డ్రివెన్ గవర్నెన్సులో గూగుల్ మనతో కలిసి పని చేయడానికి అంగీకరించింది. వాణిజ్య పన్నుల శాఖ ఇప్పటికే గూగుల్ తో కలిసి పని చేస్తోంది. ఆ దిశగా మిగిలిన శాఖల్లో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి. పీజీఆర్ఎస్ లో ప్రజలిచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి. ఈ మేరకు అర్జీదారులే స్వయంగా వారి అర్జీలను ట్రాక్ చేసుకునే అవకాశం కల్పించాలి. తామిచ్చిన ఫిర్యాదు ఏ మేరకు పరిష్కారమవుతోందోననే అంశాన్ని అర్జీదారులకు అర్థమయ్యేలా ట్రాకింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి."అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అప్రమత్తం కాకుంటే నష్టపోతాం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పార్టీ కేడర్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక దిశా నిర్దేశం చేసారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మరికొద్ది రోజుల్లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ప్రతి బిఎల్ఎ అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హత గల వ్యక్తుల ఓటర్లు తొలగించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో దిశా నిర్దేశం చేశారు.ఖమ్మం జిల్లాలో పర్యటించిన కేటీఆర్ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ, పార్టీ సభ్యత నమోదు అంశాలపై కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో గజదొంగ పాలన కొనసాగుతుంటే.. ఖమ్మం జిల్లాలో ఘరానా దొంగల పాలన కొనసాగుతుందన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా అభివృద్ధికి వారు పాటుపడిందేమి లేదని స్వార్థ ప్రయోజనాల కోసమే పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఒక మంత్రి భూముల కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారన్నారు. ఇక ఆర్థిక మంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ప్రతిరోజు కేసీఆర్ అప్పులు చేశాడని మొరుగుతున్న నాయకులు ఎందుకు చేశారో బదులిచ్చారు.

### సర్ పై కేడర్ అప్రమత్తంగా ఉండాలి

కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సజీవ సాక్షాలుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో లక్షల కోట్లు అప్పుచేసి ఏమి అభివృద్ధి చేసిందో రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఆలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతూ అనేక అక్రమాలకు ఊతమిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాలను సభా వేదికపై ప్రదర్శించారు. మరికొద్ది రోజుల్లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ప్రతి బిఎల్ఎ అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హత గల వ్యక్తుల ఓటర్లు తొలగించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో దిశా నిర్దేశం చేశారు. డిజిటల్ సభ్యత్వ నమోదులో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.బి

# కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీతో రాజీపడే ప్రసక్తే లేదు

(టీఆర్ఎస్) ద్వారానే సరికొత్త చరిత్రను లిఖిస్తానని ఆమె ఉద్ఘాటించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న కవిత, ఒకవేళ కేసీఆర్ తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తే వెళ్తారా? అన్న ప్రశ్నకు సూటిగా సమాధానమిచ్చారు. "ఖచ్చితంగా ఆ అధ్యాయం ముగిసింది. జీవితంలో కొన్నిసార్లు పేజీలు తిప్పాలి, మరికొన్నిసార్లు పుస్తకాలనే మూసివేయాలి. నేను బీఆర్ఎస్ అనే పుస్తకాన్ని ఎప్పుడో మూసివేశాను" అని ఆమె పేర్కొన్నారు.గత ఏడాది సెప్టెంబర్‌లో కవితను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. హరీశ్ రావు, జోగినపల్లి సంతోష్ కుమార్ తదితరులు కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ ప్రతిష్టకు భంగం కలిగించారని ఆమె బహిరంగంగా ఆరోపణలు చేయడంతో పార్టీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత, ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆమె 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో సరికొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. బీఆర్ఎస్ పాలనలో తనకు అనేక చేదు అనుభవాలు ఎదురయ్యాయని, సామాజిక న్యాయం, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు వంటి హామీలను ఆ పార్టీ నెరవేర్చలేకపోయిందని కవిత విమర్శించారు. ప్రాంతీయ భావజాలం నుంచి బీఆర్ఎస్ వైదొలగడం వల్లే ప్రజలకు దూరమైందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీయే తమ ప్రధాన ప్రత్యర్థి అని, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు స్లీప్ మోడ్‌లోకి వెళ్లిపోయాయని ఆమె వ్యాఖ్యానించారు. ఇక ఢిల్లీ మద్యం కేసులో తనపై దిగువ కోర్టులో ఎలాంటి అభియోగాలు నమోదు కాలేదని, ఈడీ, సీబీఐ అప్పీళ్ల అంశాన్ని న్యాయవ్యవస్థకే వదిలేస్తున్నానని ఈ సందర్భంగా వెల్లడించారు.

# ఫీజుల బాటలో ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లకు సంబంధించి మాతృసంస్థ 'మెటా ప్లాట్‌ఫామ్స్' ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఉచితంగా అందిస్తున్న ఈ యాప్‌లలో అదనపు ఫీచర్ల కోసం ఐచ్ఛిక పెయిడ్ సబ్‌స్క్రిప్షన్లను అందుబాటులోకి తెచ్చింది. 'ప్లస్' పేరుతో వస్తున్న ఈ కొత్త సేవలు మే నెలాఖరు నుంచి ప్రపంచవ్యాప్తంగా దశలవారీగా అమల్లోకి వచ్చాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో వేల కోట్ల డాలర్లు పెట్టుబడిగా పెడుతున్న తరుణంలో, కేవలం ప్రకటనల ఆదాయంపైనే ఆధారపడకుండా కొత్త ఆదాయ మార్గాలను సృష్టించుకోవడమే లక్ష్యంగా మెటా ఈ అడుగు వేసింది.

### భారత్‌లో రూ.99కే ప్రీమియం ప్లాన్లు

ఈ కొత్త ప్లాన్ల ప్రకారం, 'ఇన్‌స్టాగ్రామ్ ప్లస్', 'ఫేస్‌బుక్ ప్లస్' కోసం నెలకు సుమారు 3.99 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. భారత్‌లో దీని ధరను ప్రారంభ ఆఫర్లతో కలిపి సుమారు రూ.99గా నిర్ణయించారు. అదేవిధంగా 'వాట్సాప్ ప్లస్' సబ్‌స్క్రిప్షన్ కోసం నెలకు 2.99 డాలర్లు (భారత్‌లో సుమారు రూ.99) చెల్లించాలి. ఈ ప్లాన్లు తీసుకున్న యూజర్లకు స్టోరీల నిడివి పెంచుకోవడం, ప్రొఫైల్ కస్టమైజేషన్, సూపర్ రియాక్షన్లు, సీక్రెట్ స్టోరీ వ్యూయింగ్, మరిన్ని చాట్‌లను పిన్ చేసుకునే సౌలభ్యం వంటి పలు ప్రీమియం ఫీచర్లు అందుబాటులోకి వస్తాయి. అయితే, ప్రస్తుతం ఉన్న ప్రాథమిక సేవలు యథాతథంగా అందరికీ ఉచితంగానే కొనసాగుతాయని, వాటిలో ఎలాంటి మార్పు ఉండదని మెటా స్పష్టం చేసింది.

### ఏఐ పెట్టుబడుల కోసమే ఈ వ్యూహం

మెటా ఈ ఏడాది తన మూలధన వ్యయాన్ని ఏకంగా 125 బిలియన్ డాలర్ల నుంచి 145 బిలియన్ డాలర్లకు పెంచింది. ఈ భారీ మొత్తాన్ని ప్రధానంగా ఏఐ డేటా సెంటర్లు, కంప్యూటింగ్ పవర్, ఇతర మౌలిక సదుపాయాల కోసమే కేటాయిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రకటనలకు అతీతంగా స్థిరమైన ఆదాయాన్ని సమకూర్చుకోవడం కంపెనీకి అత్యవసరంగా మారింది. ఇటీవలే భారత్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో కలిసి గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఒక ఏఐ డేటా సెంటర్‌ను అభివృద్ధి చేసేందుకు మెటా ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం.ఈ కొత్త సబ్‌స్క్రిప్షన్ల ద్వారా దీర్ఘకాలంలో కంపెనీకి గణనీయమైన ఆదాయం లభించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. యూజర్లు కోరుకుంటున్న ఎన్నో మెరుగైన ఫీచర్లను ఈ 'ప్లస్' సేవల్లో అందిస్తున్నామని మెటా ప్రొడక్ట్ హెడ్ నవోమి గ్లీట్ తెలిపారు. త్వరలో వ్యాపారాలు, క్రియేటర్ల కోసం, అలాగే నెలకు 19.99 డాలర్ల వరకు ఉండే అధునాతన ఏఐ ఫీచర్ల కోసం కూడా ప్రత్యేక సబ్‌స్క్రిప్షన్లను పరీక్షిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.అయితే, ఈ కొత్త పెయిడ్ ప్లాన్లపై నిపుణుల నుంచి, యూజర్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఏఐపై చేస్తున్న భారీ ఖర్చును సమర్థించుకోవడానికి మెటాకు ఇలాంటి ఆదాయ మార్గాలు అవసరమని 'టెకార్క్' నిపుణుడు ఫైసల్ కవూసా అభిప్రాయపడగా, ఏఐ పెట్టుబడులపై బలమైన రాబడి వచ్చే వరకు ఇవి కేవలం ఒక 'స్టాప్‌గ్యాప్' ఏర్పాటు మాత్రమేనని ఏఐ నిపుణుడు శ్రీనివాస్ పద్మనాభుని పేర్కొన్నారు. పవర్ యూజర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు మినహా సాధారణ యూజర్లు డబ్బు చెల్లించి ఈ సేవలు పొందేందుకు పెద్దగా ఆసక్తి చూపకపోవచ్చని ప్రాథమిక స్పందనలు సూచిస్తున్నాయి.

## ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ రైతులకు మేలు చేస్తుంది

**- ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు**

**- కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జి**

**- ముత్యాల సునీల్ కుమార్**



బాల్కొండ ( ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా రైతులకు యూరియా పారదర్శకంగా, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అందుబాటులో ఉంటుందని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ తెలిపారు. ఈ యాప్ ద్వారా యూరియా స్టాక్ వివరాలు రైతులకు తెలిసే అవకాశం ఉండటంతో పాటు దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు. ఎరువులను ఇతర అవసరాలకు మళ్లించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు కూడా చెక్ పడుతుందని అన్నారు. స్మార్ట్‌ఫోన్ లేని రైతుల కోసం వ్యవసాయ అధికారులు, మీసేవ కేంద్రాలు, టోల్ ఫ్రీ నంబర్ ద్వారా బుకింగ్ సౌకర్యం కల్పించామని తెలిపారు. కొత్త విధానం అమలులో ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు వచ్చినా ప్రభుత్వం వాటిని పరిష్కరిస్తుందని, రైతులు అపోహలకు లోనుకావద్దని ముత్యాల సునీల్ కుమార్ కోరారు.

## పోక్సో, హత్య కేసులో నిందితుడికి కఠిన శిక్ష

**- జిల్లా ఎస్పీ : మహేష్ బి గితే**



సిరిసిల్ల / వేములవాడ (ప్రశ్న న్యూస్) మైనర్ బాలికపై లైంగిక వేధింపులు, అనంతరం హత్యకు పాల్పడిన నిందితుడు బండపల్లి నవీన్‌కు సిరిసిల్ల పోక్సో కోర్టు కఠిన శిక్ష విధించింది. పోక్సో కేసులో 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.7 వేల జరిమానా, హత్య కేసులో జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ తీర్పు వెలువరించారు. పోలీసు--ప్రాసిక్యూషన్ సమన్వయంతో నేరం రుజువై శిక్ష పడినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. కేసు దర్యాప్తు, కోర్టు విచారణలో కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. మైనర్లపై నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## మృతురాలి కుటుంబానికి మనోహర్ రెడ్డి పరామర్శ - ప్రగాఢ సంతాపం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని కోరెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మాదాడి రాజేందర్ రావు మాతృమూర్తి భూమక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి బుధవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా భూమక్క చిత్రపటానికి నివాళులర్పించి, మాదాడి రాజేందర్ రావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి ధైర్యం చెప్పి, ఈ కష్టకాలంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోరెం సింగిల్ విండో చైర్మన్ తీపిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ పబ్బతి విజయేందర్ రెడ్డి, నాయకులు అగ్గి రాములు, డబ్బు సుజన్ రెడ్డి, సామ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్, ఎమ్మెల్యే బొజ్జల చేతుల మీదుగా విత్తన గుళికల తయారీ



శ్రీకాళహస్తి(ప్రశ్నా న్యూస్) శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చొరవ చూపారు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి ఆయన నిర్వహిస్తున్న కార్యక్రమాల ముఖ్య ఉద్దేశాలు ప్రకృతి వ్యవసాయం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి జిల్లా కలెక్టర్ వేంకటేశ్వర్ వేడం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతు పొలాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకం జిల్లా కలెక్టర్ డా. ఎస్. వేంకటేశ్వర్ ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను అందించే ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు, జిల్లా అదనపు వ్యవసాయ సంచాలకులు ధనుంజయ రెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, ఏ.డి.ఏ. రమేష్ రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు సూర్యప్రకాశ్ రెడ్డి, వ్యవసాయ అధికారి మమత, అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పట్టాభిరెడ్డి, తహసీల్దార్, ఎంపీడీవోలు, ఏపీఓలు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల ఇన్‌చార్జీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# మల్కాపూర్ గ్రామ ప్రజల కల నెరవేర్చిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**-- ఎమ్మెల్యే సత్యం కు ప్రత్యేక కృతజ్ఞతలు**

**- మల్కాపూర్ గ్రామ సర్పంచ్ : మడ్లపల్లి తులసి - గంగయ్య**

**- గ్రామస్తుల హర్షధ్వానాల మధ్య ఆర్టీసీ బస్సును గ్రీన్ సిగ్నల్**

**- నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యం కల్పిస్తాం**

**- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని మల్కాపూర్ గ్రామ ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. రవాణా సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలు, విద్యార్థులు, రైతులు, కార్మికులకు ఊరటనిస్తూ మల్కాపూర్ గ్రామానికి నూతన టీజీఎస్సార్టీసీ బస్సు సర్వీసును చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం బుధవారం ప్రారంభించారు. కరీంనగర్ నుంచి బయలుదేరే ఈ బస్సు మల్కాపూర్, గంగాధర, తిప్పాయిపల్లి మీదుగా వేములవాడ వరకు నడవనుంది. గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం పచ్చజెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలు, తోరణాలతో అలంకరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, ఆర్టీసీ వేములవాడ డిపో మేనేజర్ బోనాల శ్రీనివాస్, బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మనబోయిన సువీన్ యాదవ్, మల్కాపూర్ సర్పంచ్ మడ్లపల్లి తులసి - గంగయ్యతో కలిసి బస్సులో ప్రయాణించి గ్రామ ప్రజలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం గ్రామీణ మహిళల జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. మల్కాపూర్ వంటి గ్రామాల మహిళలు, విద్యార్థినులు ఇకపై సురక్షితంగా, ఉచితంగా కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాలకు ప్రయాణించే అవకాశం లభించిందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఎడపల్లి తిరుపతి, వార్డు సభ్యులు అతికం మునిందర్ గౌడ్, అమిరిశెట్టి గంగయ్య, మల్లారపు లక్ష్మణ్, మల్లారపు విజయ, గడ్డమీది శ్రావణి - రాజేంద్రప్రసాద్, కోరెపు జయంత్, అక్కెనపల్లి ప్రత్యూష - అరుణ్, ఆర్టీసీ అధికారులు, వేములవాడ డిపో సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజల అవసరాన్ని గుర్తించి బస్సు సర్వీసు మంజూరు చేయించిన ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్వాడీలు ల, ప్రాథమిక పాఠశాల బలోపేతం కావాలి

**- వయసులను బట్టి ప్రాథమిక పాఠశాల,**

**అంగన్వాడి సెంటర్ విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి**

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ప్రాథమిక పాఠశాలలు ,అంగన్వాడీలు మరింత బలోపేతం కావాలని, అంగన్వాడీలు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ,ప్రాథమిక పాఠశాలలను డిఆర్డిఓ, డీఈవో ,డిడబ్ల్యూఓ, గ్రామ సర్పంచ్ తో కలిసి సందర్శించారు. జిల్లా కలెక్టర్ అంగన్వాడి కేంద్రంలోనీ చిన్నారులతో ముచ్చటించారు.

ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలు ప్రాథమిక పాఠశాలలు మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు అంగన్వాడిలలో , ప్రీ స్కూల్స్ లో,ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, త్రాగునీరు, టాయిలెట్స్,విద్యుత్ లతోపాటు అన్ని సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. అంగన్వాడీలలో, ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచాలని, తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపకుండా ,ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలన్నారు. అంగన్వాడి టీచర్లు , ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమన్వయంతో విద్యార్థుల వయస్సును బట్టి అంగన్వాడి, ప్రాథమిక పాఠశాలలో నమోదు చేయించాలని అధికారులు ఆదేశించారు. అంతకుముందు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ పుస్తకాలు పంపిణీ చేశారుఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి,ఏ ఎం ఓ సుదర్శన్ మూర్తి , ఎంఈఓ తారా సింగ్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల, కళాశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక తనిఖీలు

## పాఠశాల బస్సులు నిబంధనలకు అనుగుణంగా ఉండాలి

**భద్రత ప్రమాణాలు పాటించని బస్సులపై చట్టపరమైన చర్యలు**

**మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లా పోలీసు శాఖ, రవాణా శాఖ సంయుక్తంగా పాఠశాల, కళాశాల బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాయి. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఆదేశాల మేరకు జిల్లాలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలు తమ పరిధిలోని విద్యాసంస్థల బస్సులను రవాణా శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేస్తున్నారు. ఈ తనిఖీల్లో బస్సుల ఫిట్‌నెస్, బ్రేకులు, టైర్ల పరిస్థితి, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఎమర్జెన్సీ డోర్, జీపీఎస్, సీసీ కెమెరాలు తదితర భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నిర్దేశిత నిబంధనలను పాటించని వాహనాలపై మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యమని పేర్కొన్న జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, పాఠశాల యాజమాన్యాలు, కళాశాలల నిర్వాహకులు మరియు వాహన యజమానులు అన్ని భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ఫిట్‌నెస్ లేని వాహనాలను విద్యార్థుల రవాణాకు వినియోగించరాదని సూచించారు. విద్యార్థులకు సురక్షితమైన ప్రయాణ వాతావరణం కల్పించేందుకు అన్ని విద్యాసంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

## విలాసాగర్‌లో అగ్నిప్రమాదం.. సర్పంచ్ చొరవతో మంటలు అదుపు

**-అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**- విలాసాగర్ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామ ఎస్సీ కాలనీ సమీపంలో జగ్గారావుపల్లి వెళ్లే రహదారి వద్ద బుధవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు వరి కళ్లాలకు నిప్పంటించడంతో మంటలు వేగంగా వ్యాపించి సమీప వ్యవసాయ పొలాలకు చేరుకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అగ్నిమాపక శాఖకు సమాచారం అందించి ఫైర్ ఇంజన్‌ను రప్పించారు. ఫైర్ సిబ్బంది చేరుకునేలోపు గ్రామ యువకులు, రైతులతో కలిసి స్వయంగా మంటలను అదుపు చేసే చర్యల్లో పాల్గొన్నారు. సమయానికి స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. వ్యవసాయ భూముల్లో వరి కళ్లాలను నిర్లక్ష్యంగా కాల్చవద్దని, అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ ఏనుగుల కనకయ్య సూచించారు.

## గంజాయిని నిర్మూలిద్దాం




శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తిలో గంజాయి రహిత సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పీ పోలీసు ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం మాదకద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు నాశనం కాకుండా చూడటంలో పోలీసు యంత్రాంగం కఠినంగా వ్యవహరించడం గంజాయి లేదా మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా పోరాడటం అనేది మనందరి సామాజిక బాధ్యత. మన యువతను ఆరోగ్యకరమైన మార్గంలో ఉండాలి అని డిఎస్పి చెప్పినారు పోలీసుల కీలక చర్యలు నిఘా పెంపు పట్టణంలోని అనుమానిత ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాలు, మరియు శివారు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా అక్రమ రవాణా నియంత్రణ అంతర్రాష్ట్ర సరిహద్దుల నుండి గంజాయి రవాణాను అడ్డుకోవడానికి తనిఖీ కేంద్రాలను పటిష్టం చేశారు. కౌన్సెలింగ్ ఒ అవగాహన:వాళ్లకు గంజాయికి బానిసలైన వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇప్పించడం మరియు యువతకు దీని దుష్పరిణామాలపై అవగాహన కల్పించడం .కఠిన చర్యలు: గంజాయి విక్రయదారులుకు సరఫరాదారులు ఎవరైనా సరే, ఎంతటి వారైనా కఠినంగా శిక్షించేలా కేసులు నమోదు చేయడం. ఈ సామాజిక రుగ్మతను నిర్మూలించడంలో ప్రజల భాగస్వామ్యం చాలా కీలకం సమాచారం అందించండి: మీ ప్రాంతంలో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు లేదా వాడుతున్నట్లు తెలిస్తే, వెంటనే పోలీసులకు సమాచారం అందించండి. మీ వివరాలను గోప్యంగా ఉంచుతామని డిఎస్పి చెప్పినారుఈ కార్యక్రమంలో డిఎస్పి నర్సింగ్ మూర్తి సీఐ తిమ్మప్ప వన్ టౌన్ పోలీసులు టూ టౌన్ పోలీసులు అర్బన్ పోలీసులు పాల్గొన్నారు.

### తిరుచానూరు అమ్మవారి ఆలయంలో
# వైభవంగా ఆర్జిత సేవలు

- శ్రీ పద్మావతి అమ్మవారి సేవలతో భక్తులకు ఐశ్వర్యం ఆధ్యాత్మిక ప్రశాంతత.
- సంప్రదాయ వస్త్రధారణతో సేవల్లో పాల్గొనాలని సూచించిన: టీటీడీ



**తిరుపతి (ప్రశ్న న్యూస్)** కలియుగంలో భక్తుల కోరికలను కరుణతో తీర్చే సిరుల తల్లి శ్రీ పద్మావతి అమ్మవారి అనుగ్రహంతో భక్తులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక ప్రశాంతత కలగాలని సంకల్పిస్తూ తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నిత్యం ఆర్జిత సేవలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. పాంచరాత్ర ఆగమ శాస్త్ర విధానాల ప్రకారం జరుగుతున్న ఈ సేవల్లో దేశ విదేశాల నుండి వేలాదిమంది భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులవుతున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నిత్య, వారాంత, నెలవారీ, వార్షిక, శాశ్వత ఆర్జిత సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అమ్మవారికి సమర్పించే ప్రతి సేవ భక్తులలో భక్తి భావనను పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తోంది. ప్రతి ఏడాది మే నెలలో వార్షిక వసంతోత్సవాలు, సెప్టెంబర్ నెలలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. నవంబర్ నెలలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో అంకురార్పణ రోజున లక్ష కుంకుమార్చన, మరుసటి రోజు పుష్పయాగం వైభవంగా జరుగుతాయి. ఆగస్టు లేదా సెప్టెంబర్ నెలలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తారు. శాశ్వత సేవలుశాశ్వత సేవలలో భాగంగా నిత్య అర్చన, ఊంజల్ సేవలను భక్తులు కోరిన రోజున నిర్వహించి ఇద్దరికి దర్శన భాగ్యం కల్పిస్తారు. అదేవిధంగా శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ శ్రీనివాస స్వామివారి ఆలయంలో ప్రతి శనివారం ఉదయం, అలాగే శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో ప్రతి ఆదివారం ఉదయం అభిషేక సేవలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఆర్జిత సేవల టికెట్లను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ https://ttdevesthanams.ap.gov.in లో ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా కూడా సేవా టికెట్లు పొందవచ్చు. ఆర్జిత సేవల్లో పాల్గొనే భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో, సేవ సమయానికి ముందుగానే ఆలయానికి చేరుకొని టీటీడీ నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు. భక్తులు అమ్మవారి సేవల్లో పాల్గొని దైవానుగ్రహాన్ని పొందాలని కోరడమైనది

## విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించి ఆదుకోవాలి

- రైతు బుచ్చిరెడ్డి





**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన రైతు బుచ్చిరెడ్డి తన వ్యవసాయ బోరు మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ నిలిపివేయడంతో సాగు పనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గజ్వేల్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న తన వ్యవసాయ భూమిలో పంటలు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నానని తెలిపారు. అయితే బోరు మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ నిలిపివేయడంతో పంటలకు నీరు అందించలేక వ్యవసాయం దెబ్బతింటోందన్నారు. రైల్వే నిర్మాణ పనుల కోసం తన వ్యవసాయ భూమి నుంచి దాదాపు ఒక ఎకరం భూమిని కోల్పోయినప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించామని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రస్తుతం విద్యుత్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. రైల్వే అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు తమ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని బోరు మోటార్‌కు విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించి రైతును ఆదుకోవాలని బుచ్చిరెడ్డి విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## హక్కుల సాధనలో తిరుగులేని శక్తి "తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్"

- రాష్ట్ర కార్యనిర్వహకాధ్యక్షులు వి. వేణు కుమార్
- నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు









**నాచారం (ప్రశ్న న్యూస్)** తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా బుధవారం నాడు నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి ప్రాంగణంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాచారం ఈఎస్ఐ బ్రాంచ్ అధ్యక్షురాలు జి. విక్టోరియా యూనియన్ జండాను ఆవిష్కరించి, యూనియన్ వ్యవస్థాపకులు కామ్రేడ్ జి. రామచందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వహకాధ్యక్షులు కామ్రేడ్ వి. వేణుకుమార్ మాట్లాడుతు పోరాటాల పునాదులపై పుట్టి ఉద్యోగుల సమస్యల పట్ల అలుపెరగని పోరాటాలు చేస్తు ఎన్నో విజయాలను సాధించిన ఒకేఒక యూనియన్ తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కామ్రేడ్ ఎస్. ప్రేమలత, యూనియన్ సభ్యులు నర్సింగ్ రావు, సంతోష్, చంద్రకళ, భాగ్య, కృష్ణ, రఘు, కుమార్, బాలేశ్వరి, కాంట్రాక్ట్ యూనియన్ సభ్యులు క్రాంతి, భాస్కర్, తో పాటు వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# కుదపెట్టిన బంగారంపై కన్నేసిన మార్వాడీలు

- 11 నెలల గడువు పేరుతో ప్రజల ఆస్తుల స్వాహా.? - తక్కువ రుణం.. ఎక్కువ వడ్డీ.. చివరికి బంగారమే మాయం




**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** అత్యవసర అవసరాల కోసం బంగారం కుదపెట్టి రుణాలు తీసుకున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు కొందరు ప్రైవేట్ మార్వాడీ ఫైనాన్సర్ల వ్యవహారాలతో తీవ్రంగా నష్టపోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని లాలాపేటలో "రిషెబ్", "పవన్ బ్రోకర్స్" వంటి పేర్లతో నిర్వహిస్తున్న కొందరు వ్యాపారులు బంగారం అసలు విలువలో కేవలం 20 నుంచి 25 శాతం మాత్రమే రుణంగా ఇచ్చి, అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. బంగారం మార్కెట్ విలువ లక్షల రూపాయలు ఉన్నప్పటికీ, దానికి చాలా తక్కువ మొత్తాన్ని మాత్రమే రుణంగా మంజూరు చేస్తున్నారని, 11 నెలల పాటు వడ్డీలు చెల్లించకపోతే మొత్తం బంగారాన్ని తమ సొత్తుగా సొంత రూల్స్ తో ప్రకటిస్తున్నారని పలువురు వాపోతున్నారు. బంగారం విలువ ప్రస్తుతం భారీగా పెరిగిన నేపథ్యంలో ఈ వ్యవహారం మరింత తీవ్రరూపం దాల్చిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వడ్డీ పేరుతో దోపిడీ.. బంగారం మొత్తం స్వాధీనం.?

నెలకు మూడు రూపాయల వరకు వడ్డీ వసూలు చేస్తూ, గడువు ముగిసిన తర్వాత అసలు యజమానులకు సరైన సమాచారం ఇవ్వకుండా బంగారాన్ని వేలం వేయడం లేదా స్వాధీనం చేసుకోవడం జరుగుతోందని బాధితులు ఆరోపిస్తున్నారు. కొందరు రుణగ్రహీతలు ఆర్థిక ఇబ్బందులతో వడ్డీలు చెల్లించలేకపోతే, వారి బంగారాన్ని పూర్తిగా కోల్పోతున్న పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు. కొందరు మార్వాడీలు ఇదే పనిగా బంగారం ప్రజల నుంచి దోచుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నారని ఇది భారీ బంగారం స్కామ్ గా ప్రభుత్వం పర్యావరణంలోకి తీసుకొని వీళ్ళ వద్ద బంగారం పెట్టుకునే అధికారాన్ని రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు అవసరాలను వారు ఆసరాగా చేసుకొని ప్రజలను దోచుకోవడం తప్ప మరొకటి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు కూడా ఇలా చేయవు..

నియంత్రిత ఆర్థిక సంస్థలు రుణగ్రహీతలకు నోటీసులు జారీ చేయడం, చెల్లింపులకు అవకాశం కల్పించడం వంటి ప్రక్రియలు పాటిస్తుంటే, కొందరు ప్రైవేట్ ఫైనాన్సర్లు మాత్రం ఏకపక్ష నిర్ణయాలతో ప్రజల బంగారాన్ని స్వాధీనం చేసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు కూడా ఇంత కఠినంగా వ్యవహరించవని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. వాస్తవానికి కూడా పెట్టుకున్న బంగారం తర్వాత తీసుకున్న వడ్డీ ఎంత ఉందో ఆరోజు మార్కెట్ ధర బంగారం ఎంతుందో అందులో నుంచి తీసేసి మిగిలిన బంగారం డబ్బులు ఇవ్వాలి కానీ అలా ఇవ్వకుండా మార్వాడీలు పూర్తిగా వారే దోచుకోవడం జరుగుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్..

తెలంగాణ వ్యాప్తంగా కోట్ల రూపాయల విలువైన బంగారం ఇలాంటి ప్రైవేట్ ఫైనాన్సర్ల వద్ద ఉందని అంచనా వేస్తున్న ప్రజాసంఘాలు, ఈ వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని బంగారం కుద పెట్టుకునే మార్వాడి పవన్ బ్రోకర్ల పై ముక్కుమ్మడిగా దాడులు చేసి పూర్తిస్థాయిలో బంగారు నిలువలు బయటికి తీయాలని ప్రజలు కోరుతున్నారు. బంగారం తాకట్టు వ్యాపారాలపై సమగ్ర విచారణ జరిపి, రుణగ్రహీతల హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలు వ్యాపారులపై ప్రజల నుండి తీవ్రంగా వస్తున్నయని వాటి నిజానిజాలను ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు ద్వారా నిర్ధారించాల్సి ఉందని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. బాధితులు తమ వద్ద ఉన్న ఒప్పంద పత్రాలు, రసీదులతో అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ప్రజల ఆర్థిక బలహీనతలను ఆసరాగా చేసుకుని ఎవరైనా దోపిడీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సామాజిక వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

# యువత రాకెట్‌లా దూసుకెళ్లాలి: మంత్రి సీతక్క

## మెగా జాబ్ మేళాలో వందలాది మందికి ఉద్యోగాలు, నియామక పత్రాల అందజేత



**ములుగు(ప్రశ్న న్యూస్ )** జిల్లాలోని యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, మెగా జాబ్ మేళాలు నిరుద్యోగ యువత జీవితాల్లో కొత్త ఆశలకు నాంది పలుకుతున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా ఇంచర్లలోని ఎం.ఆర్. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళా-2026 కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### మత్తుకు దూరంగా ఉండాలి..

ఉద్యోగం చేయాలనే సంకల్పంతో యువత నిరంతరం కృషి చేయాలని, వచ్చిన అవకాశాలను వదులుకొని సమయాన్ని వృథా చేస్తూ మత్తు పదార్థాల ఊబిలో చిక్కుకోకుండా గౌరవప్రదమైన జీవనాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. మేధో సంపత్తి పెంపొందించుకునేందుకు శ్రమించాలని, ఉన్నత ఆశయాలు సాధించిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

### ఉచిత శిక్షణకు ఏర్పాట్లు..

రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో యువతకు ప్రత్యేకంగా వసతి గృహాలు ఏర్పాటు చేసి గ్రామీణాభివృద్ధి తదితర అంశాలపై ఉచిత శిక్షణ కార్యక్రమాలు అందించే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. త్వరలో రాబోయే పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం జిల్లా యువతీ యువకులకు ఉచిత శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగం రాని వారికి మళ్లీ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళాలు నిర్వహిస్తామని భరోసా ఇచ్చారు.

### రెండు వేల మంది హాజరు..

జిల్లా కలెక్టర్ హేమంత్ మాట్లాడుతూ, మెగా జాబ్ మేళాకు సుమారు రెండు వేల మందికి పైగా నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారని తెలిపారు. ఉద్యోగం సాధించిన వారు శిక్షణ కాలాన్ని సమర్థవంతంగా పూర్తి చేసి అద్భుతమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు.

ప్రాంతీయ తారతమ్యం లేకుండా ఉద్యోగం వచ్చిన ప్రాంతానికి వెళ్లి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కోరారు. జిల్లా ఎస్పీ సుధీర్ మాట్లాడుతూ, యువత తమ జీవిత లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని అన్నారు. మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉంటూ విద్య, ఉపాధి, వ్యక్తిత్వ వికాసం వైపు దృష్టి సారించాలని సూచించారు. ఐటీడీఏ పీవో లెనిన్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో మెగా జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమని, నైపుణ్యాభివృద్ధి కోసం ఉచిత వసతితో కూడిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, ఏఎస్పీ మనన్ భట్, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఇంచర్ల సర్పంచ్ కుమార్ గౌడ్, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 'రమణి కల్యాణం' మూవీ రివ్యూ!



సూర్య వశిష్ఠ – దీప్సిక చంద్రన్ ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమానే 'రమణి కల్యాణం'. విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమా, మే 22వ తేదీన థియేటర్లలో విడుదలైంది. ఈ నెల 12వ తేదీ నుంచి 'ఈటీవీ విన్' లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా కథేమిటనేది ఇప్పుడు చూద్దాం. సంజన (దీప్సిక) చూపులేని అమ్మాయి. తల్లీదండ్రులను కోల్పోయిన ఆమె, బామ్మ దగ్గరే పెరుగుతుంది. అనాథలైన నలుగురు పిల్లలను దత్తత చేసుకుని వాళ్ల ఆలనా పాలనా చూస్తుంటుంది. ఒక వైపున పబ్ లో సింగర్ గా.. మరో వైపున ఒక ఎఫ్ ఎమ్ రేడియోలో ఆర్జేగా పనిచేస్తుంటుంది. తనకి చూపు లేకపోవడాన్ని ఒక లోపంగా భావించడం ఆమెకి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళుతుంటుంది. అలాంటి సమయంలోనే ఆమెకి రాజ్ (సూర్య వసిష్ఠ) తారసపడతాడు. రాజ్ మంచి కవి .. అతని రెండు కాళ్లూ పనిచేయవు.అందువలన అతను వీల్ ఛైర్ కి పరిమితమవుతాడు. అనాథగా మిగిలిపోయిన రాజ్ ను అతని స్నేహితులైన కిశోర్ – గీత (శ్రీనివాసరెడ్డి – శ్యామల) దంపతులు చూసుకుంటూ ఉంటారు. రెండు కాళ్లను కోల్పోయిన కారణంగా రాజ్ చాలా డీలాపడిపోతాడు. పోయింది నడక మాత్రమే తప్ప, భవిష్యత్తు కాదనే సంజన మాటలు అతనిలో కొత్త ఆశలను రేకెత్తిస్తాయి. వాళ్లిద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారుతుంది. సంజనకి చూపులేని కారణంగా సంబంధాలు రావడమే కష్టమైపోతుంది. వచ్చిన సంబంధాలు ఆమె పెంచుతున్న పిల్లల కారణంగా వెళ్లిపోతుంటాయి. అలాంటి సమయంలో ఆమె రాజ్ ను ప్రేమించడం బామ్మకు ఆనందాన్ని కలిగిస్తుంది. ఇక ఒంటరిగా మిగిలిపోయిన దగ్గర నుంచి కుమిలిపోతున్న రాజ్, సంజన రాకతో సంతోషంగా ఉండటం కిశోర్ దంపతులకు ఆనందాన్ని ఇస్తుంది. సంజన – రాజ్ పెళ్లి చేసుకుందామని అనుకుంటూ ఉండగా ఒక అనూహ్యమైన సంఘటన జరుగుతుంది. అదేమిటి? అది వాళ్ల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుంది? అనేది కథ.చూపులేని అమ్మాయి .. కాళ్లు లేని అబ్బాయి. ఒకరు కవి అయితే .. మరొకరు గాయని. అలాంటి ఈ ఇద్దరి మధ్య నడిచే ప్రేమకథ ఇది. ఇద్దరూ ఆయా సందర్భాలలో తల్లిదండ్రులను కోల్పోయినవారే. అలాంటి ఆ ఇద్దరూ కలిసి నడవాలని అనుకుంటారు .. కలిసి బతకాలని నిర్ణయించుకుంటారు. సన్నిహితులంతా వాళ్ల నిర్ణయం పట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తారు. అలాంటి ఆ సమయంలో ఏం జరిగిందనే ఒక అంశం చుట్టూ దర్శకుడు ఈ కథను నడిపించాడు. ఫస్టాఫ్ అంతా హీరో – హీరోయిన్ పరిచయం, ఆ పరిచయం ప్రేమకి దారితీయడం వంటి సన్నివేశాలతో ఈ కథ ముందుకు వెళుతుంది. ఇద్దరి ఫ్లాష్ బ్యాకులు కూడా ఫస్టాఫ్ లోనే వచ్చేస్తాయి. ఈ సమయంలో వచ్చే బ్యాంగ్ తోనే ఇంటర్వెల్ కార్డు పడుతుంది. ఆ తరువాత నుంచి కథలో చోటుచేసుకునే సన్నివేశాలు ఎలా ఉండనున్నాయి? అనే ఒక ఆసక్తి ఆడియన్స్ లో మొదలవుతుంది. ప్రీ క్లైమాక్స్ తో వచ్చే ట్విస్ట్ తో ఈ కథను క్లైమాక్స్ దిశగా పరిగెత్తించారు. చూపులేని హీరోయిన్ .. కాళ్లు లేని హీరో అనగానే, ఎంజాయ్ చేయలేని ప్రేక్షకులు అనే మాటనే ఆ తరువాత వినిపిస్తుంది. చూపులేని వాళ్లను హీరోయిన్ రోడ్డు దాటిస్తుంటే ఆడియన్స్ ముచ్చట పడతారు. కాళ్లు లేనివారికి హీరో సాయం చేస్తే శభాష్ అంటూ మెచ్చుకుంటారు. కానీ హీరోయిన్ కే చూపులేకపోతే, హీరోకే కాళ్లు లేకపోతే .. అనే ఆలోచనకు దృశ్య రూపమే ఈ సినిమా. అయ్యో పాపం ఇద్దరికీ ఇలా అయిందే అనుకుంటూ సర్దుకుపోదామని అనుకుంటే, ఆ ఇద్దరూ తమ తల్లిదండ్రులను వేరు వేరు సంఘటనలలో కోల్పోవడం తాలూకు ఫ్లాష్ బ్యాకులొచ్చి మీద పడతాయి. వాటి బరువు మోయలేక ఆడియన్స్ విలవిలలాడుతూ ఉండగానే, మరో ట్విస్ట్. తెరపై హీరో– హీరోయిన్ లను కోలుకోనీయలేదు .. ఆడియన్స్ ను తేరుకోనీయలేదు. హీరో – హీరోయిన్స్ ను అలా చూడగానే ఆడియన్స్ వినోదం శూన్యమనుకునే కూర్చుంటారు. అయినా ఊహించుకోవచ్చుగదా అన్నట్టుగా పాటలు పెట్టారు. అవి కూడా అంతంత మాత్రమే. చూపులేని అమ్మాయిగా చేయడానికి హీరోయిన్ .. కాళ్లు లేనివాడిగా కనిపించడానికి హీరో చాలా కష్టపడ్డారని అనుకోవడం సహజం. కానీ నిజానికి అసలైన కష్టం ఆడియన్స్ దేనని చెప్పాలి. ఆ ఇద్దరినీ అలా చూస్తూ కూర్చోవడం అంత సామాన్యమైన విశేషమేం కాదు మరి. అరవింద్ తిరుకోవేల ఫొటోగ్రఫీ .. రవితేజ గిరిజాల ఎడిటింగ్ .. సూరజ్ కురుప్ సంగీతం ఓ మాదిరిగా అనిపిస్తాయి.ఇలాంటి కథలు 1980లలో చాలానే వచ్చాయి. సెంటిమెంట్ .. ఎమోషన్స్ తాలూకు కంటెంట్ ను ప్రేక్షకులు ఆదరించిన రోజులవి. కానీ ఇప్పుడు ఈ తరహా కథలతో ఆడియన్స్ ను మెప్పించడం కష్టమనే చెప్పాలి.

హీరో – హీరోయిన్స్ కి శారీరక లోపాలు కలిగించి, వాళ్ల ద్వారా అన్నివైపుల నుంచి పండే వినోదానికి తలుపులు మూసేయడమే ప్రధానమైన లోపం అని చెప్పాలి. కొన్ని కథలు మాత్రమే పుస్తకం నుంచి తెరపైకి వస్తే బాగుంటాయి. కొన్ని కథలు పుస్తకానికి పరిమితమవుతేనే బాగుంటాయి. ఈ రెండో వర్గానికి చెందిన కథలను తెరపైకి తీసుకుని వస్తే ఎలా ఉంటుందనడానికి సమాధానమే ఈ సినిమా. రొటీన్ కంటెంట్ తో రావడం .. వినోదానికి దూరంగా వెళ్లడమే ఈ సినిమా నిరాశపరచడానికి ప్రధాన కారణంగా చెప్పుకోవలసి ఉంటుంది.

# తొలిప్రేమ జ్ఞాపకాల్లో..



తిరుపతి నేపథ్య కథాంశంతో రూపొందిస్తున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న ఈ సినిమాకు అజయ్‌భూపతి దర్శకుడు. జూలై 9న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ఈ చిత్రంలోని 'గుండె పేలిపోతుందే..' అనే పాటను విడుదల చేశారు. తొలిప్రేమలోని మధురభావాలకు అద్దంపడుతూ, ప్రేమికుల అంతరంగాన్ని అందంగా ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. జీవీప్రకాష్‌కుమార్ స్వరపరచిన ఈ పాటను చంద్రబోస్ రచించగా, అనురాగ్ కులకర్ణి ఆలపించారు. దేవాలయం నేపథ్యంలో చిత్రీకరించిన విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, ప్రొడక్షన్ డిజైనర్: సాహి సురేష్, నిర్మాణ సంస్థ: చందమామ కథలు, సమర్పణ: సి.అశ్వినీదత్, రచన–దర్శకత్వం: అజయ్ భూపతి.

## కత్తి పట్టిన ఆధునిక సీత.. అదరగొడుతున్న అలియా భట్ 'ఆల్ఫా' ట్రైలర్




బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిలిమ్స్ (వైఆర్‌ఎఫ్) తమ స్పై యూనివర్స్‌లో మరో కొత్త చిత్రాన్ని ప్రకటించింది. అలియా భట్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు 'ఆల్ఫా' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను తాజాగా విడుదల చేయగా, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమా జులై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.ఈ చిత్రంలో అలియా భట్ 'సీత' అనే ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. చిన్నతనం నుంచే ఆమె తండ్రి (బాబీ డియోల్) ఒక కఠినమైన సీక్రెట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆమెను ఒక కిరాయి హంతకురాలిగా తీర్చిదిద్దుతాడు. ఆధునిక కాలపు సీత తనదైన 'అగ్ని పరీక్ష'ను ఎలా ఎదుర్కొంది అనే థీమ్‌తో ఈ సినిమా సాగనుంది. టీజర్‌లో అలియా భట్ భీకరమైన యాక్షన్ సన్నివేశాల్లో కనిపించారు. కత్తి యుద్ధాలు, ఛేజింగ్ సీన్లు ఆమె పాత్రలోని క్రూరమైన, భీకరమైన కోణాన్ని ఆవిష్కరించాయి. 18వ పుట్టినరోజునే ఆమెను 'ఆల్ఫా' అనే ఎలైట్ ఆపరేటివ్‌గా మార్చే సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి.ఈ సినిమాలో అలియా భట్‌తో పాటు మరో నటి శర్వరీ వాఘ్ కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇద్దరు మహిళా ఆపరేటివ్‌లు కలిసి ఒక శక్తివంతమైన శత్రువును ఎలా ఎదుర్కొన్నారు అనేది కథలో కీలకం. సీనియర్ నటుడు అనిల్ కపూర్ ఒక ముఖ్యమైన ఇంటెలిజెన్స్ అధికారి పాత్రలో నటిస్తుండగా, ఈ సినిమాకు అసలైన హైలైట్ హృతిక్ రోషన్ కావడం విశేషం. వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్‌లోని 'వార్' సిరీస్‌లో తను పోషించిన 'కబీర్' పాత్రలో హృతిక్ ఇందులో ప్రత్యేక అతిథిగా కనిపించనున్నారు. దీంతో ఈ సినిమా కూడా టైగర్, వార్ ఫ్రాంచైజీల ప్రపంచంలో భాగమని స్పష్టమైంది.'ది రైల్వే మెన్' సిరీస్‌తో విమర్శకుల ప్రశంసలు పొందిన శివ్ రావల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆదిత్య చోప్రా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారతదేశంలో పూర్తిస్థాయిలో మహిళా ప్రధాన పాత్రలతో వస్తున్న తొలి భారీ యాక్షన్ చిత్రంగా 'ఆల్ఫా' నిలవనుంది. పోస్ట్ ప్రొడక్షన్, వీఎఫ్‌ఎక్స్ పనుల్లో ఆలస్యం కారణంగా పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా జులై 3న విడుదల కానుంది.


## చుక్కలు తెమ్మన్నా.. తెంచుకురానా..



కెరీర్‌పరంగా జయాపజయాలతో సంబంధం లేకుండా మంచి స్టార్‌డమ్‌తో దూసుకుపోతున్నది అచ్చ తెలుగందం శ్రీలీల. చూడముచ్చటైన రూపం, చలాకీ అభినయంతో యువతరంలో ఈ భామ తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. అయితే ఇప్పటివరకు ఎక్కువగా వాణిజ్య చిత్రాల్లో గ్లామర్ ప్రధాన పాత్రల్లోనే కనిపించడంతో నటిగా ఆమె పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించే అవకాశం రావడంలేదన్నది అభిమానుల అభిప్రాయం. ఈ నేపథ్యంలో కెరీర్‌లోనే తొలిసారి ఈ ముద్దుగుమ్మ మహిళా ప్రధాన చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని ఫిల్మ్‌నగర్ టాక్.వివరాల్లోకి వెళితే..దర్శకనిర్మాత వేణు ఊడుగుల 1994 మద్యపాన నిషేధం నేపథ్యంలో ఓ మహిళా ప్రధాన చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. తొలుత ఈ చిత్రంలో కథానాయికగా భాగ్యశ్రీబోర్సే, సాయిపల్లవి పేర్లు వినిపించాయి. వరుస సినిమాలతో వారిద్దరూ బిజీగా ఉండటంతో మేకర్స్ మరో నాయిక అన్వేషణలో పడ్డారని, చివరకు శ్రీలీలను ఖరారు చేశారని సమాచారం. ఈ పీరియాడిక్ చిత్రానికి 'చుక్కలు తెమ్మన్నా తెంచుకురానా' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఈ చిత్రానికి రమేష్ ఎలిగేటి దర్శకత్వం వహించబోతున్నారని సమాచారం.

## కన్నప్ప మళ్లీ వచ్చేస్తున్నాడు..

### మంచు విష్ణు రీరిలీజ్ పోస్టర్ వైరల్




టాలీవుడ్ యాక్టర్ మంచు విష్ణు టైటిల్ రోల్ పోషించిన చిత్రం కన్నప్ప ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ మూవీ గతేడాది జూన్ 29న గ్రాండ్‌గా విడుదల కాగా.. ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల అంచనాలు అందుకోలేకపోయింది. మాలీవుడ్ స్టార్ యాక్టర్ మోహన్ లాల్ కిరాట పాత్రలో నటించగా.. ఈ మూవీలో మోహన్ బాబు, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, ప్రభాస్, కాజల్, బ్రహ్మానందం కీ రోల్స్ పోషించారు.ఈ మూవీని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. కన్నప్ప విడుదలై ఏడాది పూర్తి చేసుకోనున్న సందర్భంగా జూన్ 27న రీరిలీజ్ చేయనున్నారు. లిమిటెడ్ స్క్రీన్లలో రిలీజ్ కాబోతున్న ఈ మూవీ నయా పోస్టర్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. కన్నప్ప చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు. ఈ మూవీని 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ,బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.కన్నప్ప మూవీకి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ఈ చిత్రంలోనయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్, ఐశ్వర్య ఇతర కీలక పాత్రల్లో నటించారు.

## భారత్‌కు క్రిస్టోఫర్ నోలన్ రాక..

# ముంబైలో 'ది ఒడిస్సీ' గ్రాండ్ ప్రీమియర్







ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులకు, ముఖ్యంగా భారతీయ ప్రేక్షకులకు ఇది ఒక శుభవార్త. 'ఒపెన్‌హైమర్', 'ఇంటర్‌స్టెల్లార్', 'ఇన్‌సెప్షన్', 'ది డార్క్ నైట్' వంటి అద్భుతమైన చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న దిగ్గజ హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తొలిసారిగా భారత్‌లో అడుగుపెట్టనున్నారు. తన సరికొత్త చిత్రం 'ది ఒడిస్సీ' ప్రీమియర్ కోసం ఆయన జులైలో ముంబైకి రానున్నట్లు యూనివర్సల్ పిక్చర్స్ ఇంటర్నేషనల్ అధికారికంగా ప్రకటించింది.ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి నోలన్‌తో పాటు ఆ చిత్రంలో నటించిన ఆస్కార్ విజేత మ్యాట్ డామన్, ప్రముఖ నటుడు టామ్ హాలండ్, ఆస్కార్ అవార్డు గ్రహీత, నిర్మాత ఎమ్మా థామస్ కూడా హాజరుకానున్నారు. క్రిస్టోఫర్ నోలన్ సినిమా ఒకటి భారతదేశంలో ప్రీమియర్ జరుపుకోవడం ఇదే మొదటిసారి. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా జులై 17న థియేటర్లలోకి రానుంది.'ది ఒడిస్సీ' గ్లోబల్ ప్రీమియర్ టూర్‌లో భాగంగా లండన్, పారిస్, న్యూయార్క్ వంటి ప్రధాన నగరాలతో పాటు ముంబైని కూడా అధికారికంగా ఎంపిక చేయడం భారతీయ మార్కెట్‌కు ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. హోమర్ రచించిన ఇతిహాసం 'ఒడిస్సీ' ఆధారంగా ఈ చిత్రాన్ని నోలన్ తెరకెక్కించారు. ట్రాయ్ పతనం తర్వాత ఒడిస్సియస్ పదేళ్లపాటు తన ఇంటికి తిరిగి వెళ్లే ప్రయాణాన్ని ఈ చిత్రంలో అద్భుతంగా చూపించనున్నారు.ఈ సినిమాకు ఒక ప్రత్యేకత ఉంది. సరికొత్త ఐమ్యాక్స్ (×హీూశ) ఫిల్మ్ టెక్నాలజీని ఉపయోగించి పూర్తిగా ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరించిన మొట్టమొదటి ఫీచర్ ఫిల్మ్ ఇదే కావడం విశేషం. ముంబైలోని ఫీనిక్స్ పల్లాడియంలో ఉన్న పీవీఆర్ ఐకాన్ ఐమ్యాక్స్ థియేటర్‌లో ఈ ప్రీమియర్ వేడుక జరగనుంది.ఈ చిత్రంలో మ్యాట్ డామన్, టామ్ హాలండ్‌లతో పాటు ఆన్ హాత్వే, రాబర్ట్ ప్యాటిన్సన్, లుపిటా యోంగో, జెండాయా, చార్లీజ్ థెరాన్ వంటి భారీ తారాగణం నటించింది. నోలన్, ఎమ్మా థామస్ తమ సింకోపీ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే భారతదేశంలోని పలు సినిమా థియేటర్లలో 'ది ఒడిస్సీ' ఐమ్యాక్స్ వెర్షన్ కోసం అడ్వాన్స్ టికెట్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. భారత గడ్డపై జరుగుతున్న అతిపెద్ద హాలీవుడ్ ఈవెంట్‌లలో ఒకటిగా ఈ ప్రీమియర్ నిలవనుంది.

## స్విమ్మింగ్ కోసం సొంత దేశాన్ని వదిలిపెట్టా..



నటుడు మాధవన్ కుమారుడు వేదాంత్ తాజాగా చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. 20 ఏళ్ల ఫ్రీస్టైల్ స్విమ్మర్ అయిన వేదాంత్ తన కెరీర్ కోసం భారత్‌లోని జీవితాన్ని వదులుకుని దుబాయ్‌కు వెళ్లినట్లు చెప్పాడు. కోవిడ్–19 సమయంలో భారత్‌లో స్విమ్మింగ్ పూల్స్ మూతపడటంతో 2020లో వేదాంత్ కుటుంబంతో సహా దుబాయ్‌కు మకాం మార్చాడు.ఆ మార్పు గురించి వేదాంత్ తాజాగా మాట్లాడుతూ.. షిఫ్ట్ అయితే మంచిగానే జరిగింది. మా ఆస్తులన్నీ ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాం. కానీ నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావడం మాత్రం నాకు షాక్‌లాగే అనిపించింది. పుట్టినప్పటి నుంచి భారత్‌లోనే ఉన్నాను. కొత్త దేశానికి, కొత్త స్కూల్ లైఫ్‌కు అలవాటు పడటం, అదే సమయంలో స్విమ్మింగ్, సోషల్ లైఫ్ మేనేజ్ చేయడం కాస్త కష్టమైంది అని వేదాంత్ అన్నారు. కోవిడ్ పరిస్థితుల్లో దుబాయ్‌కు రావడం నా కెరీర్‌కు మంచి నిర్ణయమే. దానివల్లే నేను డెన్మార్క్‌లో రేస్ చేయగలిగాను.భారత్‌లో నా ఫ్రెండ్స్‌తో ఉన్న జీవితాన్ని, నాకున్న వాతావరణాన్ని త్యాగం చేశాను. కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి, కొత్త దేశంలో నాకు నచ్చిన పని చేయగలుగుతున్నాను అని వేదాంత్ తెలిపాడు. ఇక తల్లిదండ్రుల మద్దతుపై వేదాంత్ మాట్లాడుతూ.. మా అమ్మానాన్నలు నాకు చాలా సపోర్టివ్. కలలను సపోర్ట్ చేసే తల్లిదండ్రులు అందరికీ ఉండరు. ఆ విషయంలో నేను చాలా లక్కీ. వాళ్లు లేకపోతే నేను ఈ స్థాయిలో ఉండేవాడిని కాదు. స్విమ్మింగ్‌లో పేరెంట్స్ కూడా టీమ్‌లో భాగమే. వారి సపోర్ట్ లేకపోతే ఏదీ సరిగ్గా సాగదు అని వేదాంత్ చెప్పుకోచ్చాడు. మాధవన్, సరితా బిర్జే 1999లో వివాహం చేసుకున్నారు. ఎనిమిదేళ్ల డేటింగ్ తర్వాత పెళ్లి చేసుకున్న వీరికి 2005లో వేదాంత్ జన్మించాడు. ఇక సినిమాల విషయానికి వస్తే, మాధవన్ ఈ ఏడాది 'ధురంధర్ 2' చిత్రంలో కనిపించారు. వచ్చే వారం రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకోనున్నారు.

# వెన్నుపోటుకు పేటెంట్ హక్కుదారుడు జగన్

## - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఇప్పుడు నీతులు చెబుతున్నాడు
- అబద్ధాలతో అధికారం... అరాచకాలతో గత ఐదేళ్ల పాలన
- తల్లి, చెల్లిని రాజకీయంగా వాడుకుని పక్కన పెట్టింది ఎవరు



**అమరావతి(ప్రశ్న న్యూస్)** రాష్ట్ర రాజకీయాల్లో వెన్నుపోటు గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్ మోహన్ రెడ్డికి లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. వెన్నుపోటుకు కర్త, కర్మ, క్రియ జగన్‌నేనని, ఆ పదానికి పేటెంట్ హక్కులు ఎవరైనా ఇవ్వాలంటే అది జగన్‌కే ఇవ్వాలని ఎద్దేవా చేశారు. బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు గతాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలని కోరుతున్నాను. రాష్ట్ర విభజన తర్వాత 2014లో ఆంధ్రప్రదేశ్ తీవ్ర సంక్షోభంలో పడింది. రాజధాని లేదు, ఆదాయం లేదు, పరిశ్రమలు లేవు, ఉద్యోగ అవకాశాలు లేవు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రాన్ని గాడిలో పెట్టగల సమర్థ నాయకుడు కావాలని ప్రజలు భావించి తెలుగుదేశం పార్టీకి అవకాశం ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి రాష్ట్ర పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. ఐదేళ్లలో ప్రజలు ఊహించని స్థాయిలో అభివృద్ధి చేసి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టేందుకు కృషి చేశాం. అయితే 2019లో అబద్ధాలు, అసత్యాలు, సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసి జగన్ అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వెనక్కి నెట్టారు. మాట్లాడే స్వేచ్ఛ లేకుండా చేశారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టారు. వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలపై దమనకాండ సాగించారని తెలిపారు.

# శ్రీపద్మావతీ చిన్నపిల్లల ఆసుపత్రి నిర్మాణం

- నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి:జేఈవో డా. ఎ. శరత్ ఆదేశాలు
- నాణ్యత, పనుల వేగంపై ప్రతి వారం సమీక్షలు



**తిరుపతి(ప్రశ్న న్యూస్)** అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణంలో ఉన్న శ్రీపద్మావతీ చిన్నపిల్లల ఆసుపత్రి నూతన భవన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని టిటిడి జేఈవో డా. ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. టిటిడి ఈవో ఎం. రవిచంద్ర ఆదేశాల మేరకు బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షించారు.ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, చిన్నారులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న ఈ ఆసుపత్రి భవనం పనుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అధికారులు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో కలిసి పనుల పురోగతిని సమీక్షించి, నిర్ణీత కార్యాచరణ ప్రకారం పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అభివృద్ధి పనుల వేగాన్ని మరింత పెంచేందుకు అవసరమైన నిపుణులు, కార్మికులు, నిర్మాణ సామగ్రిని తక్షణమే సమకూర్చాలన్నారు. అలాగే మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫర్నిచర్, ఎలక్ట్రికల్, పెయింటింగ్, గార్డెనింగ్, క్లీనింగ్, నిర్వహణ తదితర మౌలిక సదుపాయాల పనులను సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు.భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని, ప్రతి వారం పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. వారానికోసారి నిర్మాణ స్థలాన్ని సందర్శించి పనుల స్థితిగతులను పరిశీలిస్తూ అవసరమైన మార్గదర్శకాలు అందిస్తామన్నారు.ప్రతి అంతస్తులో జరుగుతున్న పనులపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించిన జేఈవో, నాణ్యత విషయంలో రాజీ పడకుండా, ఇంజినీరింగ్ పనుల్లో ఎలాంటి అలసత్వానికి అవకాశం ఇవ్వవద్దని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిఎఫ్వో డి. ఫణికుమార్ నాయుడు, ఆసుపత్రి డైరెక్టర్ డా. ఎన్. శ్రీనాథ్ రెడ్డి, ఎస్.ఈలు వేంకటేశ్వర్లు, మనోహరం, ఈఈలు సుమతి, సరస్వతి, డిప్యూటీ ఈఈ హర్షవర్ధన్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# బీహార్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి 15 ఎకరాల భూమి కేటాయింపు

- బీహార్ ప్రభుత్వానికి టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు కృతజ్ఞతలు




తిరుపతి (ప్రశ్న న్యూస్) ఉత్తర భారత దేశంలో సనాతన ధర్మ ప్రచారానికి, శ్రీవారి భక్తులకు ఆధ్యాత్మిక సేవలను మరింత చేరువ చేయడానికి మరో కీలక అడుగు పడింది. బీహార్ రాజధాని పాట్నా సమీపంలో గంగా నది తీరానికి దగ్గరగా, జాతీయ రహదారి పక్కన శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం బీహార్ ప్రభుత్వం 15 ఎకరాల భూమిని కేటాయించింది.ఈ సందర్భంగా టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి, శ్రీవారి జ్ఞాపికను అందజేశారు. ఈ సమావేశంలో బీహార్ చీఫ్ సెక్రటరీ అమృత్ ప్రత్యయ్ పాల్గొన్నారు.ప్రతిపాదిత ఆలయ ప్రాంగణంలో ప్రధాన దేవాలయంతో పాటు కళ్యాణ మండపం, పుష్కరిణి, యాత్రికుల సౌకర్యాలకు అవసరమైన ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టనున్నారు.దేశంలోని వివిధ ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం ద్వారా సనాతన ధర్మ ప్రచారాన్ని విస్తరించాలనే లక్ష్యంతో టీటీడీ ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో అన్ని రాష్ట్ర రాజధానుల్లో శ్రీవారి ఆలయాలను ఏర్పాటు చేయాలనే సంకల్పంతో కార్యాచరణ కొనసాగుతోంది.ఇప్పటికే అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం 10 ఎకరాల భూమి కేటాయింపు పూర్తికాగా, ఇప్పుడు బీహార్‌లోని పాట్నా సమీపంలో ఆలయ నిర్మాణానికి భూమి కేటాయించడం విశేషం.ఉత్తర భారత భక్తులకు తిరుమల శ్రీవారితో అనుబంధాన్ని మరింత పెంచడంతో పాటు, ఈ ఆలయం భవిష్యత్తులో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు టీటీడీ ప్రణాళికలు రూపొందిస్తోంది.

# ఖరీదైన వైద్యం.. సామాన్యుడికి సొంతం

- ప్రజల వద్దకే కార్పొరేట్ వైద్యం: పురపాలక మంత్రి నారాయణ - 47వ డివిజన్లో నారాయణ ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన
- ఆరోగ్య నెల్లూరే లక్ష్యం..గుప్తా పార్క్ సెంటర్‌లో నారాయణ నేత్ర జ్యోతి - దంత సురక్ష - పేదల ఆరోగ్యం కోసం నారాయణ హాస్పిటల్స్ అద్భుత ముందడుగు
- నెల్లూరులో నారాయణ ఉచిత వైద్య శిబిరం సూపర్ సక్సెస్



**నెల్లూరు (ప్రశ్న న్యూస్)** ప్రజాసేవే పరమావధిగా పొంగూరు నారాయణ మార్గదర్శకత్వంలో, నెల్లూరు 47వ డివిజన్ గుప్తా పార్క్ సెంటర్లో నారాయణ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నారాయణ నేత్ర జ్యోతి నారాయణ దంత సురక్ష ఉచిత వైద్య శిబిరాలకు ప్రజల నుండి అద్భుతమైన స్పందన లభించింది. గతంలో మహాలక్ష్మి గుడి సెంటర్లో విజయవంతమైన ఈ శిబిరాన్ని ప్రజల విజ్ఞప్తి మేరకు రెండోసారి ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు 47&48 డివిజన్ల క్లస్టర్ ఇంచార్జ్ ధర్మవరపు సుబ్బారావు ,గణేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది

ఈ సందర్భంగా కంటి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సుధా, ధర్మవరపు సుబ్బారావు మాట్లాడుతూ..అత్యాధునిక కంప్యూటరైజ్డ్ పరికరాలతో ఉచిత కంటి మరియు దంత పరీక్షలు నిర్వహించారన్నారు. ఇప్పటివరకు దాదాపు 8,700 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు చేసి, 5,600 మందికి పైగా ఉచితంగా అద్దాలను పంపిణీ చేయడమే కాకుండా, అవసరమైన వారికి ఉచిత శస్త్రచికిత్సలను కూడా అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా, పేద ప్రజలకు మరింత నాణ్యమైన కార్పొరేట్ వైద్యం అందించడం కోసం నారాయణ హాస్పిటల్ లో ఇటీవల కోటి వ్యయంతో సరికొత్త ఆపరేటింగ్ మైక్రోస్కోప్‌ను అందుబాటులోకి తెచ్చారన్నారు.. కేవలం ఆసుపత్రికే పరిమితం కాకుండా నేరుగా ప్రజల ఇళ్ల వద్దకే వచ్చి ఉచిత వైద్యం అందించడంపై ప్రజల నుండి హర్షం వ్యక్తమవుతోందన్నారు. ఒకపక్క నెల్లూరు ప్రజల ఆరోగ్యం, సంక్షేమం చూస్తూనే, మరోపక్క అమరావతి రాజధాని అభివృద్ధి కోసం రాత్రింబవళ్లు 24ఇ7 శ్రమిస్తున్న నారాయణ నిరుపమానమైన సేవా నిరతిని, దృఢ సంకల్పాన్ని స్థానిక నేతలు, ప్రజలు ఈ సందర్భంగా ఘనంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ చెంగయ్య ఆచారి, బీసీ సెల్ ,వైస్ ప్రెసిడెంట్ ముని శేఖర్, యూనిట్ ఇంచార్జి అబ్దుల్ రెహ్మాన్ ఖాన్, కోటపాటి రాజా,53 బూత్ కన్వీనర్ నాగార్జున, మైనారిటీ ప్రెసిడెంట్ ఫిరోజ్ అహ్మద్, సిటీ మైనారిటీ మహబూబ్ బాషా .. అద్దంకి చంద్రశేఖర్,స్థానిక టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రుషికొండ ప్యాలెస్‌ను 'రిసార్ట్'గా, ప్రజల సందర్శనార్థం వినియోగం

- ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్న కేబినెట్ సబ్ కమిటీ
- రూ.450 కోట్ల ప్రజాధనంతో విలాసాల పర్వం -- చదరపు అడుగుకు రూ.6,450 ఖర్చు చేయడం అత్యంత దుర్మార్గం: ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్
- గతంలో ఏటా రూ.7.5 కోట్ల ఆదాయం తెచ్చిన 'హరిత రిసార్ట్స్'ను కూల్చి టూరిజం డిపార్ట్‌మెంట్‌ను నష్టాల్లో ముంచారు: పర్యాటక మంత్రి కందుల దుర్గేష్
- పేదల ఇళ్ల సైజులో బాత్‌రూమ్‌లు.. గత ప్రభుత్వానిది వంచన, విధ్వంసక పాలన: మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి
- నాటి సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి కట్టిన భవనాలకు కూల్చే ప్రసక్తే లేదు..సామాన్యుడికి అందుబాటులోకి తెస్తాం.. పీపీపీ విధానంలో 'రుషికొండ'కు పూర్వవైభవం: మంత్రుల బృందం
- ఆసక్తి ఉన్న సంస్థలు, అర్హత పరిశీలించాక రుషికొండ భవనాల వినియోగంపై సీఎంకు నివేదిక.. సీఎం అధ్యక్షతన జరిగే కేబినెట్‌దే అంతిమ నిర్ణయం: మంత్రుల కమిటీ



**విశాఖపట్నం(ప్రశ్న న్యూస్)**గత ప్రభుత్వ హయాంలో వివాదాస్పదంగా నిర్మించిన రుషికొండ భవన సముదాయాన్ని (ప్యాలెస్) వందల కోట్ల ప్రజాధనం వృథా కాకుండా, పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానంలో అంతర్జాతీయ స్థాయి లగ్జరీ రిసార్ట్‌గా మార్చాలని, ప్రజల సందర్శనార్థం వినియోగించాలని ప్రాథమిక నిర్ణయించినట్లు మంత్రివర్గ ఉపసంఘం వెల్లడించింది. సుమారు రూ. 450 కోట్ల ప్రజాధనంతో, నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన ఈ రాజప్రాసాదాన్ని కూల్చివేయకుండా, ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చేలా 'హాస్పిటాలిటీ' రంగానికి కేటాయించడమే సముచితమైన మార్గమని కమిటీ అభిప్రాయపడింది.వైజాగ్ వాసుల సెంటిమెంట్‌ను గౌరవిస్తూ ప్రజల సందర్శనార్థం ఒక బ్లాక్‌ను కల్చరల్ లేదా హెరిటేజ్ సెంటర్‌గా ఉంచేలా రూపొందించిన ఈ నివేదికను అంతిమ నిర్ణయం కోసం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే కేబినెట్ ముందుకు త్వరలోనే తీసుకెళ్లనున్నట్లు మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది.వివరాల్లోకి వెళ్తే విశాఖపట్నంలోని రుషికొండ భవనాల (ప్యాలెస్) వినియోగం తదుపరి కార్యాచరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిలతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం భవన సముదాయాన్ని స్వయంగా సందర్శించింది. ఈ పరిశీలనలో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్, పర్యాటక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.మంత్రుల బృందం ప్యాలెస్‌లోని ప్రతి బ్లాక్‌ను, ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసింది. భవనాల లోపల అమర్చిన ఖరీదైన టైల్స్, బెడ్స్, ఫర్నీచర్, బాత్ టబ్స్, కమోడ్స్ వంటి అంతర్గత వసతులను, నిర్మాణ శైలిని పరిశీలించింది. అనంతరం భవనాలకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలిస్తూ ఒక్కో బ్లాక్ రూపకల్పన, వాటి ప్రస్తుత స్థితిగతులను పర్యాటక శాఖ ఇంజినీర్ అధికారులను, రెవెన్యూ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ద

పర్యటనలో భాగంగా రుషికొండ ప్యాలెస్‌తో పాటు, ఆ పరిసర ప్రాంతాల్లో బీచ్ రోడ్డుకు ఆనుకుని అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను కూడా కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సామాన్య ప్రజలకు, ప్రకృతి ప్రేమికులకు రుషికొండ ప్యాలెస్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం." అని అన్నారు.ఈ క్షేత్రస్థాయి పర్యటన సమీక్ష ఆధారంగా పూర్తి స్థాయి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు కేబినెట్ సబ్ కమిటీ వెల్లడించింది.సమావేశంలో పర్యాటక శాఖ ఈఈ ఈశ్వరయ్య, ఈడీ శేషగిరి రావు, సీఆర్ జెడ్ అధికారులు, భీమిలీ ఆర్డీవో, డీవీఎం జగదీష్, డీటీవో కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహణ:కలెక్టర్ కీర్తి చేకూరి



రాజమహేంద్రవరం (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" జిల్లా స్థాయి కార్యక్రమం స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామా నాయుడు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, వివిధ రంగాల్లో సాధించిన ప్రగతి, లబ్ధిదారుల జీవితాల్లో వచ్చిన మార్పులను ప్రజలకు తెలియజేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని మంత్రులు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, పారదర్శక పాలన, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు, మహిళా సాధికారత, ఉపాధి కల్పన తదితర రంగాల్లో సాధించిన విజయాలను ప్రజలకు చేరవేసేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తోందన్నారుఈ సందర్భంగా సభాధ్యక్షులు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, "విద్య"ను ప్రధాన అంశంగా కేటాయించి ఈ రెండేళ్ల వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, లబ్ధిదారుల విజయగాథలను ప్రత్యేక స్టాళ్ల ద్వారా ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. విద్యారంగంలో సాధించిన పురోగతి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాల విశేషాలను ప్రతిబింబించే స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని తెలిపారు.

# 'థీమ్ బేస్డ్' పార్కుల అభివృద్ధి

## - నగర కమిషనర్ మయూర్ అశోక్

- గుంటూరు నగరంలో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం



గుంటూరు(ప్రశ్న న్యూస్)నగరవాసులకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించే లక్ష్యంతో, నగరాన్ని మరింత హరితంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు గుంటూరు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా శ్రీవాత్స బృందంతో కలిసి నగరంలోని పార్కుల అభివృద్ధి నగర సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంభర్ లో ప్రత్యేక సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో ఉన్న పార్కులను కేవలం సాధారణ ఖాళీ స్థలాలుగా కాకుండా, వినూత్నమైన 'థీమ్ బేస్డ్' విధానంలో దశల వారీగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పార్కులను పర్యావరణ పరిరక్షణ, పిల్లల క్రీడలు, వ్యాయామం మరియు కళాత్మక అంశాల వంటి నిర్దిష్ట థీమ్‌లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే నగర భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని, సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను రూపొందించడంపై శ్రీవాత్స బృందం సిద్ధం చేసిన ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించాన్నారు. ఆయా ప్రతిపాదనలలో పలు కీలక సూచనలు చేస్తూ కొన్ని మార్పులు, చేర్పులు చేశామన్నారు. నగరంలో పార్కుల అభివృద్ధి ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు, నగర ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

# స్కూల్ ఓపెన్.. పిల్లల ఏడుపు

**- చదువుల బాటలో చిన్నారుల మారాం - పిల్లలను స్కూలుకు పంపించడంలో తల్లిదండ్రుల కష్టాలు**







**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. దాదాపు రెండు నెలల పాటు ఇంటి వద్ద సరదాగా గడిపిన చిన్నారులు మళ్లీ చదువుల బాట పట్టారు. అయితే స్కూల్ మొదటి రోజు చాలా చోట్ల చిన్నారుల ఏడుపులు, తల్లిదండ్రులను వదిలి వెళ్లేందుకు ఇష్టపడక మారాం చేయడం కనిపించింది. స్కూల్ గేట్ల వద్ద చిన్నారుల భావోద్వేగ దృశ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.కొత్తగా ఎల్‌కేజీ, యూకేజీ, మొదటి తరగతిలో చేరిన చిన్నారులు తల్లిదండ్రులను వదిలి తరగతి గదుల్లోకి వెళ్లేందుకు నిరాకరిస్తూ బిగ్గరగా ఏడ్చారు. మరికొందరు తల్లిదండ్రుల చేతులను గట్టిగా పట్టుకుని స్కూల్‌లోకి వెళ్లేందుకు మొహమాటపడ్డారు. కొందరు పిల్లలు "అమ్మా.. నేను స్కూల్‌కు వెళ్లను" అంటూ మారాం చేస్తూ కనిపించగా, తల్లిదండ్రులు వారిని సముదాయిస్తూ పాఠశాలల్లోకి పంపించారు.కొత్త యూనిఫామ్‌లు, కొత్త బ్యాగులు, వాటర్ బాటిళ్లతో స్కూల్‌కు వచ్చిన చిన్నారులు మొదట్లో భయాందోళనకు గురైనప్పటికీ, ఉపాధ్యాయులు ప్రేమగా పలకరిస్తూ వారిలో ధైర్యం నింపారు. ఆటలు, పాటలు, కథల ద్వారా పిల్లలను ఆకట్టుకుంటూ కొత్త వాతావరణానికి అలవాటు చేసే ప్రయత్నం చేశారు. దీంతో కొంతసేపటి తర్వాత చాలా మంది చిన్నారులు తమ స్నేహితులతో కలిసి ఆనందంగా గడపడం కనిపించింది.మొదటిసారి పిల్లలను స్కూల్‌కు పంపుతున్న తల్లిదండ్రులకు కూడా ఇది భావోద్వేగ క్షణంగానే మారింది. పిల్లలు ఏడుస్తుంటే కొందరు తల్లులు కంటతడి పెట్టారు. పిల్లల భవిష్యత్తు కోసం చదువు ఎంతో అవసరమని తెలిసినా, వారిని వదిలి రావడం కష్టంగా అనిపించిందని పలువురు తల్లిదండ్రులు తెలిపారు.విద్యార్థుల రాకతో కొన్ని రోజులుగా నిర్మానుష్యంగా కనిపించిన పాఠశాలలు మళ్లీ సందడిగా మారాయి. స్కూల్ ప్రాంగణాలు పిల్లల కేరింతలు, ఆటపాటలు, నవ్వులతో కళకళలాడాయి. ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగతం పలుకుతూ పాఠశాల మొదటి రోజును ప్రత్యేకంగా నిర్వహించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు స్వాగత కార్యక్రమాలు నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు.మనస్తత్వ నిపుణుల అభిప్రాయం ప్రకారం చిన్నారులు స్కూల్ ప్రారంభ రోజుల్లో ఏడవడం సహజమే. కొత్త వాతావరణం, కొత్త ముఖాలు, తల్లిదండ్రుల నుంచి దూరంగా ఉండాల్సి రావడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుందని, కొద్ది రోజుల్లోనే పిల్లలు స్కూల్‌కు అలవాటు పడతారని చెబుతున్నారు.ఏడుపులు, మారాం, భయాలు ఉన్నప్పటికీ చిన్నారుల విద్యా ప్రయాణం ప్రారంభమైంది. నేటి ఈ చిన్న అడుగులే రేపటి వారి విజయాలకు పునాది కానున్నాయి. స్కూల్ మొదటి రోజు కనిపించిన ఈ భావోద్వేగ దృశ్యాలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఎప్పటికీ గుర్తుండిపోయే మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోనున్నాయి.

# మునీరాబాద్ 'మాలకుంట' కబ్జా

## నిమ్మకు నీరెత్తిన యంత్రాంగం

- ఎనిమిది ఎకరాల చెరువు.. ఎకరం మాత్రమే మిగిలిన వైనం
- హైడ్రా యాక్షన్ ఎక్కడ..?
- 8. 01 ఎకరాల చెరువు.. రికార్డుల మాయాజాలంతో స్వాహా
- అస్తవ్యస్తమైన నీటి వ్యవస్థ.. కాలనీలకు ముంపు ముప్పు
- హైడ్రా' బుల్డోజర్లు మునీరాబాద్ వైపు రావా. ?



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** అక్రమార్కుల జేసీబీలకు చెరువులు కుంచించుకుపోతున్నాయి.. రికార్డుల్లో కాగితాలు మారుతున్నాయి.. కానీ పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం మాత్రం గుర్రుపెట్టి నిద్రపోతోంది మేడ్చల్ మండలంలోని మునీరాబాద్ గ్రామ సంస్కృతికి, స్థానిక మత్స్యకారుల జీవనోపాధికి ప్రతీకగా నిలిచిన చారిత్రక జలవనరు "మాలకుంట" ప్రస్తుతం భూబకాసురుల చేతుల్లో చిక్కి అంతరించిపోతోంది. బడా వ్యాపారులు యథేచ్ఛగా మట్టిపోసి చెరువును సమం చేస్తుంటే, అటు రెవెన్యూ, ఇటు ఇరిగేషన్ అధికారులు కంటితుడుపు చర్యలకైనా రాకపోవడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

### 8.01 ఎకరాల చెరువు.. రికార్డుల మాయాజాలంతో స్వాహా

ప్రభుత్వ అధికారిక రికార్డుల ప్రకారం మాలకుంట విస్తీర్ణం 8.01 ఎకరాలు. కానీ క్షేత్రస్థాయికి వెళ్తే అక్కడ రెండు ఎకరాల కంటే తక్కువ విస్తీర్ణంలోనే నీరు కనిపిస్తోంది. మిగిలిన సుమారు ఆరు ఎకరాల చెరువు భూమిని అక్రమార్కులు ఏకంగా మింగేశారు ఈ కబ్జా వెనుక పెద్ద రెవెన్యూ స్కామ్ నడుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మునీరాబాద్ పరిధిలో ఉన్న ఈ కుంటను, రికార్డుల్లో మాత్రం పక్కనే ఉన్న 'పూడూరు' గ్రామంలో ఉన్నట్లు చూపిస్తున్నారు. ఈ సరిహద్దుల అయోమయాన్ని ఆసరాగా చేసుకుని బడా వ్యాపారులు చెరువును పూర్తిగా పూడ్చివేస్తున్నారు.

### అస్తవ్యస్తమైన నీటి వ్యవస్థ.. కాలనీలకు ముంపు ముప్పు

మాలకుంట కబ్జా కేవలం ఒక గ్రామానికి పరిమితమైన సమస్య కాదు. ఇదొక పెద్ద చారిత్రక నీటి ప్రవాహ లింక్. కండ్లకోయ పరిసర ప్రాంతాల నుండి వచ్చే వర్షపు నీరు మొదట మునీరాబాద్‌లోని మాలకుంటకు చేరేది. ఇక్కడి నుండి అదనపు నీరు పూడూరు 'ఎర్ర చెరువు'లోకి, అక్కడి నుండి చారిత్రక 'శామీర్‌పేట పెద్ద చెరువు'లోకి ప్రవహించేది. ఇప్పుడు మాలకుంటను అక్రమంగా పూడ్చివేయడంతో వర్షపు నీటి ప్రవాహ మార్గాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీనివల్ల రాబోయే వర్షాలకు చుట్టుపక్కల కాలనీలు మునిగిపోయే ప్రమాదం ఏర్పడటమే కాకుండా, కింది భాగంలో ఉన్న చెరువులు ఎండిపోయే పరిస్థితి దాపురించింది.

### హైడ్రా' బుల్డోజర్లు మునీరాబాద్ వైపు రావా.?

చెరువుల రక్షణ కోసం, అక్రమ కట్టడాల కూల్చివేతల కోసం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన "హైడ్రా"కంటికి ఈ మాలకుంట కబ్జా ఎందుకు కనిపించడం లేదని మునీరాబాద్ ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు కబ్జాదారులతో చేతులు కలిపి లోపాయికారీ ఒప్పందాలు చేసుకోవడం వల్లే 'హైడ్రా'కు సమాచారం వెళ్లకుండా తొక్కిపెడుతున్నారనే విమర్శలు బహిరంగంగానే




వినిపిస్తున్నాయి.

# నీట్ పరీక్ష కోసం టెలిగ్రామ్‌పై వేటు

**- రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్‌ను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. పరీక్షల్లో అక్రమాలను, చీటింగ్ నెట్ వర్క్‌లను నిరోధించే చర్యల్లో భాగంగా ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై దేశవ్యాప్తంగా తాత్కాలిక ఆంక్షలు విధించింది. జూన్ 21న పరీక్ష జరగనున్న నేపథ్యంలో, జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ల నుంచి టెలిగ్రామ్‌ను తొలగించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. "దొంగను పట్టుకోవడం చేతకాక, బాధితుడి ఇంటికి తాళం వేసినట్లుంది" అంటూ 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించారు. పేపర్ లీకేజీలను అరికట్టేందుకు మోదీ ప్రభుత్వం ఇదొక కొత్త ఉపాయాన్ని కనిపెట్టిందని ఆయన ఎద్దేవా చేశారు. అసలైన పేపర్ లీక్ మాఫియాను విడిచిపెట్టి, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. లక్షలాది మంది విద్యార్థులు తమ నోట్స్, టెస్ట్ సిరీస్‌ల కోసం టెలిగ్రామ్‌పైనే ఆధారపడతారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.అయితే, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సమర్థించుకుంది. వ్యవస్థీకృత చీటింగ్ ముఠాలు రీ-టెస్ట్‌లో మోసాలకు ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా నిరోధించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. పరీక్ష పత్రాల భద్రతను పర్యవేక్షించేందుకు భారత వైమానిక దళం (ఐఏఎఫ్) సహాయాన్ని కూడా తీసుకుంటున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. టెలిగ్రామ్ నిషేధంపై ఆ సంస్థ సీఈఓ పావెల్ డ్యూరోవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు చేసే తప్పులకు భారత్‌లోని 15 కోట్ల మంది వినియోగదారులను శిక్షించడం భావ్యం కాదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం యాప్ స్టోర్ల నుంచి టెలిగ్రామ్‌ను తొలగించినప్పటికీ, ఇప్పటికే మొబైల్స్‌లో యాప్ ఉన్నవారు వీపీఎన్ సాయంతో దీనిని యాక్సెస్ చేస్తున్నారు.గత మే నెలలో జరిగిన నీట్-యూజీ పరీక్ష పత్రం లీకైనట్లు వచ్చిన ఆరోపణలతో పరీక్ష రద్దయిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై ప్రస్తుతం సీబీఐ విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే రీ-ఎగ్జామ్‌ను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. కాగా, ఈ తాత్కాలిక నిషేధంపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు విపక్ష నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

# ఒప్పందం నచ్చకపోతే మళ్లీ బాంబులేస్తాం

**- ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అమెరికా-ఇరాన్ మధ్య నెలల తరబడి కొనసాగిన ఉద్రిక్తతలకు ముగింపు పలికే ఒప్పందం కుదిరే దశలో ఉన్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఒప్పంద ముసాయిదా తనకు నచ్చకపోతే ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభిస్తామని హెచ్చరించారు. దీంతో ఇప్పటికే సున్నితంగా ఉన్న పశ్చిమాసియా పరిస్థితులపై మరోసారి దృష్టి కేంద్రీకృతమైంది. ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్ సిసితో కలిసి మీడియాతో మాట్లాడిన ట్రంప్ అమెరికా-ఇరాన్ మధ్య కుదరబోయే ఒప్పందం ఇంకా తుది రూపం దాల్చలేదని చెప్పారు. ప్రస్తుతం అది కేవలం అవగాహన ఒప్పందం మాత్రమేనని పేర్కొన్నారు. "ఆ ఒప్పందం నాకు నచ్చకపోతే మళ్లీ వారిపై కాల్పులు జరుపుతాం. వారి తలలపై బాంబులు వేయడం మొదలుపెడతాం" అంటూ ట్రంప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్ ప్రవర్తన సరిగా లేకపోయినా అదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలు మళ్లీ అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించాయి

# 96 గంటల్లో 2000 టార్గెట్లు

**- ఇరాన్‌పై దాడులకు మస్క్ 'గ్రోక్' ఏఐ సాయం!**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రముఖ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాధనం 'గ్రోక్' ను ఇరాన్‌పై సైనిక దాడుల కోసం వినియోగించినట్లు అమెరికా ప్రభుత్వం సంచలన ప్రకటన చేసింది. ఈ అత్యాధునిక సాంకేతికత సాయంతో కేవలం 96 గంటల వ్యవధిలోనే ఇరాన్‌లోని 2,000 విభిన్న లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించినట్లు వెల్లడించింది. మస్క్‌కు చెందిన 'ఎక్స్‌ఏఐ' డేటా సంస్థ డేటా సెంటర్లకు సంబంధించిన ఒక పర్యావరణ కేసు విచారణ సందర్భంగా అమెరికా న్యాయశాఖ ఈ వివరాలను న్యాయస్థానానికి సమర్పించింది. జాతీయ భద్రతా ప్రయోజనాల దృష్ట్యా 'ఎక్స్‌ఏఐ' కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని ఈ సందర్భంగా వాదించింది. ఇందుకు మద్దతుగా పెంటగాన్ ఏఐ విభాగాధిపతి కామెరాన్ స్టాన్లీ ఇచ్చిన వాంగ్మూలాన్ని కోర్టుకు అందజేసింది.అమెరికా సైన్యానికి చెందిన 'ప్రాజెక్ట్ మావెన్' అనే ఏఐ టార్గెటింగ్ వ్యవస్థలో గ్రోక్‌ను అంతర్భాగం చేసినట్లు స్టాన్లీ తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్‌పై చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో డ్రోన్ ఫుటేజీని వేగంగా విశ్లేషించడంలోనూ, లక్ష్యాలను కచ్చితంగా గుర్తించడంలోనూ గ్రోక్ కీలక పాత్ర పోషించిందని ఆయన వివరించారు. గతంలో ఈ ప్రాజెక్ట్ కోసం పెంటగాన్ 'ఆంత్రోపిక్' సంస్థకు చెందిన 'క్లాడ్' అనే ఏఐ మోడల్‌ను వినియోగించింది. అయితే, నిఘా పద్ధతులపై తలెత్తిన విభేదాల కారణంగా ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకోవడంతో, ఆ స్థానంలో గ్రోక్‌ను చేర్చుకున్నారు. ప్రైవేట్ సాంకేతిక సంస్థలు సైనిక కార్యకలాపాల్లో ఏ స్థాయిలో భాగమవుతున్నాయో ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588